విశాఖపట్టణం
బుధవారం 26 ఆగస్టు 2026

For a pure tomorrow..

# జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 214 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## రాష్ట్రానికి సుజ్లాన్ కాంతులు

రూ. 10 వేల పెట్టుబడితో 4వేల ఉద్యోగాలు

1,325 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టుకు శ్రీకారం

## అఖండ గోదావరి పుష్కరాలు

ప్రకృతి ఆరాధాన, పర్యాటకం, ఆధ్యాత్మికం మిళితం

8 నుంచి 10 కోట్ల మంది పుష్కరాలకు వస్తారని అంచనా

రోజుకు కోటి మంది పుష్కర స్నానాలు ఆచరించే అవకాశం

రూ.4,026 కోట్ల వ్యయంతో 4,932 అభివృద్ధి పనులు

సీఎం చంద్రబాబు నాయుడు కీలక ఆదేశాలు

2



## ఏకగ్రీవాలు కానివ్వొద్దు

ప్రతీ చోటా పోటీ చేయాల్సిందే

ప్రభుత్వ బెదిరింపులున్నా అండగా ఉండాలి

చంద్రబాబుతో అధికారం బలం లేకుండా ఎన్నికలు జరగవు

జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో విస్తృత సమావేశాలు

యాక్టివ్ గా లేనివారు గేర్ మార్చాల్సిందే

ప్రజలంతా వైసీపీ కోసం ఎదురు చూస్తున్నారు

వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ వ్యాఖ్యలు

స్థానిక ఎన్నికలపై నేతలకు దిశానిర్దేశం

(తాడేపల్లి - జయజయహే)

రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల కోసం వైసీపీ శ్రేణులను యాక్టివ్ చేశారు వైఎస్ఆర్‌సీపీ అధినేత జగన్. పార్టీకి చెందిన కీలక నేతలతో ఆయన సమావేశమై వారికి దిశానిర్దేశం చేశారు. ప్రజలంతా వైసీపీ కోసం ఎదురు చూస్తున్నారని, స్థానిక సంస్థ ఎన్నికలు ఎలాంటి పక్షపాతం, అధికార బలం ..మిగతా 2లో

# ఇద్దరు అధ్యక్షులకు అగ్నిపరీక్షేనా...?





పల్లా, మాధవ్‌లపై విస్తృత చర్చ

వారసత్వ రాజకీయాల్లో ఇద్దరికీ ఇద్దరే...!

వచ్చే ఎన్నికల్లో పార్టీని విజయతీరాలకు చేరుస్తారా...!

ఒడ్డు నుండి తమాషా చూస్తారా...?

(ఎం. కే. సునీల్ కుమార్- జయ జయహే బ్యూరో )

విశాఖ రాజకీయాల్లో ఇద్దరు పార్టీ అధ్యక్షులపై ఒక ఆసక్తికర చర్చ మొదలైంది. రాష్ట్ర రాజకీయాల్లో కీలక పదవుల్లో ఉన్న ఈ ఇద్దరు విశాఖ వాసులే. ఒకరు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ కాగా...మరొకరు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులయిన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు. అయితే వీరిద్దరూ అధ్యక్ష హోదా లో ఎన్నికల్లో ప్రత్యక్షంగా పోటీ చేస్తారా... ఒకవేళ బరిలోకి దిగితే ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తుంది... అన్న ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఇద్దరికీ రాజకీయ కుటుంబ వారసత్వం నేపథ్యం ఉండటం ఒకవైపు బలంగా వినిపిస్తున్నా.. అదే అంశం మరోవైపు విమర్శలకు కారణమవుతోందనే చర్చ జరుగుతోంది. తండ్రుల రాజకీయ వారసత్వం, పార్టీ అండతో ఎదిగిన నేతలుగా ప్రత్యర్థులు విమర్శలు చేయడం కొత్తేమీ కాదు. అయితే ప్రజల మధ్య వ్యక్తిగత రాజకీయ బలం, స్థానిక సమస్యలపై పట్టు, ప్రజలకు అందుబాటులో ఉండే తీరు...వంటి అంశాలను బేరీజు వేసుకుంటున్నారు. ఇవే చివరికి ఎన్నికల ఫలితాలను నిర్ణయిస్తాయన్నది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయంగా ఉంది.

**మాధవ్‌కు ప్రత్యక్ష ఎన్నికల సవాల్..!**

బీజేపీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత పీవీఎన్ మాధవ్ పార్టీని రాష్ట్రవ్యాప్తంగా బలోపేతం చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమితో కలిసి ముందుకు వెళ్తామని జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సమక్షంలోనే విశాఖ కేంద్రంగా ..మిగతా 7లో

# స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యం

కార్యకర్తలో టీడీపీకి బలం

అనంత అభివృద్ధికి నా బాధ్యత

మంత్రి నారా లోకేస్ వ్యాఖ్యలు

రాయదుర్గం కార్యకర్తలతో సమావేశం

(అనంతపురం - జయజయహే)

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కృషి చేయాలని కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అసలైన బలమని అన్నారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు, గౌరవం కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. మంగళవారం రాయదుర్గం నియోజకవర్గం కణేకల్ ..మిగతా 7లో



# చక్కెరకు ఘాటు!

దిగుమతిపై ఆంక్షలు.. టారిఫ్ రేట్ కోటాకు గడువు

కిలో షుగర్ రూ. 55.70 పైసలకు చేరిక

నెలరోజుల్లో రూ. 7.52 పెరుగుదల

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)



దేశవ్యాప్తంగా చక్కెర ధరలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముడి చక్కెర దిగుమతికి సంబంధించిన నిబంధనలను సవరించింది. టారిఫ్ రేట్ కోటా కింద దిగుమతి చేసుకునే ముడి చక్కెరను దేశీయ మార్కెట్లోకి తీసుకురావడంలో ఇకపై సరుకు రవాణా ఆధారంగా గడువును నిర్ణయించనుంది. తాజా నిబంధనల ప్రకారం దిగుమతిదారులు బిల్ ఆఫ్ ఎంట్రీ దాఖలు చేసిన తేదీ నుంచి రెండు నెలల్లోపు ముడి చక్కెరను శుద్ధి చేసి, తెల్ల చక్కెరగా దేశీయ మార్కెట్లో విక్రయించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు 10 లక్షల మెట్రిక్ టన్నుల ..మిగతా 2లో



## కేంద్ర క్యాబినెట్ విస్తరణ..?

పలు రాష్ట్రాల్లో ఎన్నికల దృష్ట్యా మార్పులు

ఖాళీలను భర్తీ చేసే యోచనలో కమలదళం

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ, విస్తరణపై రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతోంది. పలు రాష్ట్రాల్లో రాబోయే అసెంబ్లీ ఎన్నికలు, భవిష్యత్ రాజకీయ సమీకరణాలు, మంత్రిత్వ శాఖల్లో పనిభారాన్ని తగ్గించే వ్యూహంలో భాగంగా ఈ మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందనే ఊహాగానాలు వెలువడుతున్నాయి. రాజ్యాంగ నిబంధనల ప్రకారం కేంద్ర మంత్రివర్గంలో గరిష్టంగా 81 మంది సభ్యులకు అవకాశం ఉండగా, ప్రస్తుతం అందులో కొన్ని పదవులు ఖాళీగా ఉన్నాయి. యువతకు, మహిళలకు మరియు వివిధ ప్రాంతాలకు ప్రాతినిధ్యం పెంచే దిశగా ఆలోచనలు సాగుతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. పలువురు మంత్రులు బహుళ శాఖల బాధ్యతలను నిర్వహిస్తుండటంతో, పనిభారాన్ని ..మిగతా 2లో

## రెండు దశాబ్దాల్లో ఇదే తక్కువ వర్షపాతం

వస్తూనే వెనక్కి తగ్గిన రుతుపవనాలు

సెప్టెంబర్‌లో మరింత ఆందోళనకరం

వ్యవసాయ రంగంపై ఎల్ నినో తీవ్ర ప్రభావం



(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

భారతీయ వ్యవసాయానికి జీవనాధారంగా భావించే నైరుతి రుతుపవనాలు ఈసారి తీవ్ర నిరాశను మిగిల్చేలా ఉన్నాయి! గత రెండు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంత బలహీనంగా ఈసారి రుతుపవనాలు ముగియనున్నట్లు వాతావరణ శాఖ వర్గాలు అంచనా వేశాయి. దీర్ఘకాలిక సగటుతో పోలిస్తే వర్షపాతం దాదాపు 15 శాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని, 2009 తర్వాత ఇదే అత్యల్ప స్థాయి అని ఇద్దరు సీనియర్ ..మిగతా 2లో

## వైసీపీకి ఎదురుదెబ్బ

రిట్ పిటీషన్ డిస్మిస్ చేసిన సుప్రీం



2

## జూడాల సమ్మె విరమణ

రెండు వారాల్లో పరిష్కారానికి హైకోర్టు ఆదేశం

చర్చల ద్వారా ఆమోదయోగ్య పరిష్కారం

(అమరావతి - జయజయహే)

జూనియర్ వైద్యులు సమ్మెను విరమించారు. ఈ విషయాన్ని జూడాలు.. హైకోర్టుకు నివేదించారు. తమ డిమాండ్లను పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని వారు హైకోర్టును అభ్యర్థించారు. జూనియర్ వైద్యుల సమ్మెపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్)పై మంగళవారం హైకోర్టు ..మిగతా 2లో



# అఖండ గోదావరి పుష్కరాలు

**ప్రకృతి ఆరాధన, పర్యాటకం, ఆధ్యాత్మికం మిళితం**

**8 నుంచి 10 కోట్ల మంది పుష్కరాలకు వస్తారని అంచనా**

**రోజుకు కోటి మంది పుష్కర స్నానాలు ఆచరించే అవకాశం**

**రూ.4,026 కోట్ల వ్యయంతో 4,932 అభివృద్ధి పనులు**

**సీఎం చంద్రబాబు నాయుడు కీలక ఆదేశాలు**

(అమరావతి - జయజయహే)



వచ్చే ఏడాది జరిగే గోదావరి పుష్కరాలను రాష్ట్ర చరిత్రలోనే అత్యంత వైభవంగా నిర్వహించాలని ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ప్రకృతి ఆరాధన, ఆధ్యాత్మికత, సంస్కృతి, పర్యాటకాన్ని మేళవిస్తూ ప్రపంచస్థాయి ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. భక్తులకు పవిత్రత, పారిశుద్ధ్యం, భద్రత, సౌకర్యాల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. గోదావరి జన్మస్థానం నుంచి సముద్ర సంగమం వరకు 'అఖండ గోదావరి' పేరుతో పుష్కరాల నిర్వహణపై కూడా పరిశీలన చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్షలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జూలై 7 వరకు 12 రోజుల పాటు గోదావరి పుష్కరాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా 8 నుంచి 10 కోట్ల మంది భక్తులు రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. రోజుకు దాదాపు కోటి మంది పుణ్యస్నానాలు చేసే పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం ఉన్న ఘాట్లను అభివృద్ధి చేయడంతో పాటు కొత్త ఘాట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పుష్కరాల కోసం మొత్తం రూ.4,026 కోట్ల వ్యయంతో 4,932 అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే రూ.899 కోట్లను విడుదల చేసినట్లు అధికారులు సీఎంకు వివరించారు. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, కాకినాడ, ఏలూరు, పోలవరం జిల్లాల్లో రోడ్లు, ఘాట్లు, తాగునీటి వసతులు, విద్యుత్, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న 259 ఘాట్లను ఆధునీకరించడంతో పాటు 181 కొత్త ఘాట్లను నిర్మించి మొత్తం 440 ఘాట్లు సిద్ధం చేస్తున్నారు. పట్టణాభివృద్ధి, ఆర్అండ్‌బీ, జల వనరులు, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నట్లు చెప్పారు. అదనపు నిధుల సమీకరణతో పాటు కేంద్ర సాయం పొందేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.

**ఏఐతో భద్రత - డ్రోన్ల పర్యవేక్షణ**

ఈసారి పుష్కరాల్లో సాంకేతికతకు పెద్దపీట వేయనున్నారు. రద్దీ నియంత్రణ కోసం ఏఐ ఆధారిత క్రౌడ్ అనలిటిక్స్, సీసీటీవీ ఎంట్రీ-ఎగ్జిట్ మానిటరింగ్, డ్రోన్ సర్వైలెన్స్, క్యూ ఆర్ ఆధారిత వాహన గుర్తింపు వ్యవస్థలను వినియోగించనున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేలా ప్రత్యేక కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రముఖ దేవాలయాలను కలుపుతూ ప్రత్యేక టెంపుల్ టూరిజం సర్క్యూట్ రూపొందించనున్నారు. పిఠాపురం శక్తిపీఠం, నాలుగు పంచారామ క్షేత్రాలు, అన్నవరం, ద్వారకా తిరుమల, వాడపల్లి, అంతర్వేది వంటి పుణ్యక్షేత్రాలను ఒకే పర్యాటక మార్గంలో అనుసంధానించాలని సీఎం ఆదేశించారు. భక్తులకు ఆధ్యాత్మిక ప్రదేశాలతో పాటు పర్యాటక ప్రాంతాలను సందర్శించే అవకాశం కల్పించేందుకు హోమ్‌స్టేలను ప్రోత్సహించాలని, కొత్త హోటళ్లకు త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని చెప్పారు. రాజమహేంద్రవరంలో భారీ కార్యక్రమాల నిర్వహణకు కన్వెన్షన్ సెంటర్ నిర్మించాలని సీఎం సూచించారు. దేశ, విదేశాల్లోని ప్రముఖులను పుష్కరాలకు ఆహ్వానించి రాష్ట్ర ప్రత్యేకత, ప్రతిష్టను ప్రపంచానికి చాటాలని చెప్పారు. పుష్కర ఘాట్లను కలిపే రహదారులను అభివృద్ధి చేయడంతో పాటు పుష్కరాలు జరిగే ఆరు జిల్లాల్లో రోడ్లపై ఒక్క గుంత కూడా కనిపించకూడదని సీఎం స్పష్టం చేశారు.

గోదావరిలో ఒక్క చుక్క మురుగునీరు కూడా కలవకుండా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. పుష్కరాల పవిత్రత, పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులకు రవాణా, వసతి, తాగునీరు, వైద్యం, భద్రత వంటి అన్ని సౌకర్యాలు సమగ్రంగా అందేలా ప్రణాళిక చేయాలని సూచించారు. : భక్తుల కోసం 30 తాత్కాలిక ఫీల్డ్ ఆస్పత్రులు, మెడికల్ క్యాంపులు, అంబులెన్సులు, ల్యాబ్‌లు ఏర్పాటు చేయనున్నారు. నదిలో భద్రత కోసం 2,697 రెస్క్యూ బోట్లు, 8,955 మంది శిక్షణ పొందిన ఈతగాళ్లు అందుబాటులో ఉంటారు. పుష్కరాలను గ్రీన్ అండ్ క్లీన్ ఈవెంట్‌గా నిర్వహించేందుకు 487 గ్రీన్ ఎనర్జీ బస్సులు నడపడంతో పాటు 11 బస్‌స్టేషన్లను ఆధునీకరించనున్నారు. గోదావరి జన్మస్థానం నుంచి సముద్ర సంగమం వరకు అనేక ఉపనదులు, వాగులు, ఏరులు కలుస్తున్న నేపథ్యంలో 'అఖండ గోదావరి' పేరుతో పుష్కరాలను నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. ప్రకృతి ఆరాధన, ఆధ్యాత్మికత, పర్యాటకం, సంస్కృతి అన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకురావడమే లక్ష్యంగా ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేశారు. స్థానిక ప్రజలను పుష్కరాల నిర్వహణలో భాగస్వాములను చేసి ఈ వేడుకను రాష్ట్రానికి ఒక గ్లోబల్ స్పిరిట్యువల్ అండ్ కల్చరల్ షోకేస్‌గా నిలపాలని సీఎం దిశానిర్దేశం చేశారు.




# రాష్ట్రానికి సుజ్లాన్ కాంతులు

**రూ. 10 వేల పెట్టుబడితో 4వేల ఉద్యోగాలు**

**1,325 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టుకు శ్రీకారం**

( అనంతపురం - జయజయహే)

అన్ని ప్రాంతాల్లో సోలార్ విద్యుత్ ఏర్పాటును ప్రోత్సహిస్తున్నామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. తిరుపతిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. మంగళవారం అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గంలోని కణేకల్లు మండలం హులికెరలో సుజ్లాన్ విండ్ పవర్ ప్రాజెక్ట్‌కు మంత్రి లోకేశ్ శంకుస్థాపన చేశారు. అలాగే సుజ్లాన్ ఎస్144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్‌ను ప్రారంభించారు. అనంతపురం జిల్లాలో సుజ్లాన్ సంస్థ రూ.10 వేల కోట్ల పెట్టుబడితో 1,325 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనుంది. పవన విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 4 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు సుజ్లాన్ సంస్థ ప్రకటించింది. రాష్ట్రంలో సుజ్లాన్ ఇప్పటికే కీలక పవన్ విద్యుత్ సంస్థగా ఎదిగింది. ఈ సంస్థకు 1700 మెగావాట్లకు పైగా స్థాపిత సామర్థ్యం ఉంది. ఇది 2030 నాటికి అదనంగా 5 వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని సుజ్లాన్ ప్రణాళికలు రూపొందించింది. నిర్దేశించుకున్న లక్ష్యానికి చేరుకునేందుకు ఈ సంస్థ ముందుకు సాగుతోంది.

# రెండు దశాబ్దాల్లో ఇదే తక్కువ వర్షపాతం

వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. ప్రపంచంలోనే 6వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన మన దేశంలో వ్యవసాయానికి వర్షాలే ప్రధాన ఆధారం. దేశ వార్షిక వర్షపాతంలో దాదాపు 70శాతం ఈ రుతుపవనాల ద్వారానే వస్తుంది. వర్షాలు ఇలా తగ్గిపోతే పంట దిగుబడులు దెబ్బతినడంతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగే ప్రమాదం ఉంది. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆదాయం తగ్గి ఆర్థిక కష్టాలు చుట్టుముట్టే అవకాశం ఉంది.

**మరింత ఆందోళనకరంగా సెప్టెంబర్ !**

పంటలు చేతికి వచ్చే కీలకమైన సెప్టెంబర్ నెలలో తగినన్ని వర్షాలు కురవకపోతే తీవ్ర నష్టం వాటిల్లుతుంది. పత్తి, సోయాబీన్, మొక్కజొన్న, కంది వంటి ఖరీఫ్ పంటల దిగుబడులు భారీగా పడిపోతాయి. అలాగే గోధుమ, ఆవాలు వంటి రబీ పంటలకు ఎంతో అవసరమైన నేలలోని తేమ కూడా తగ్గిపోతుంది. "మనం రుతుపవనాలపై ఎల్ నినో ప్రభావాన్ని ప్రత్యక్షంగా చూస్తున్నాం. సెప్టెంబర్‌లో ఈ ప్రభావం మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. వర్షపాతంలో రెండంకెల లోటును చూసే ప్రమాదం ఉంది," అని భారత వాతావరణ శాఖకు చెందిన ఒక సీనియర్ అధికారి తెలిపారు. జూన్-సెప్టెంబర్ సీజన్‌లో సాధారణం కంటే 15 శాతం తక్కువగా, అంటే కేవలం 85 శాతం మాత్రమే వర్షపాతం నమోదు కావచ్చని ఆయన చెప్పారు. 2009 తర్వాత ఇదే అత్యల్ప వర్షపాతం కావడం గమనార్హం. వాతావరణ శాఖ తొలి అంచనాలో పేర్కొన్న 8% లోటుతో పోలిస్తే ఇది దాదాపు రెట్టింపు కావడం ఆందోళన కలిగిస్తోంది. తూర్పు రాష్ట్రాలు మినహా దేశంలోని ఇతర ప్రాంతాల్లో సెప్టెంబర్‌లో సాధారణం కంటే తక్కువ వర్షాలే కురుస్తాయని, దీనివల్ల సీజనల్ లోటు మరింత పెరుగుతుందని సదరు అధికారి వివరించారు. ఈ నెల చివరి నాటికి ఐఎండీ సెప్టెంబర్ నెల అధికారిక అంచనాను విడుదల చేసే అవకాశం ఉంది.

**తొందరగా వెనక్కి తగ్గుతున్న రుతుపవనాలు!**

వాయువ్య ప్రాంతాల నుంచి ఈ ఏడాది రుతుపవనాలు సాధారణం కంటే కొన్ని రోజులు ముందే వెనక్కి వెళ్లే సూచనలు కనిపిస్తున్నాయి. కొత్తగా ఎలాంటి వాతావరణ వ్యవస్థ ఏర్పడకపోతే సెప్టెంబర్‌లోనే ఈ ఉపసంహరణ మొదలుకావచ్చని మరొక వాతావరణ శాఖ అధికారి తెలిపారు. సాధారణంగా జూన్‌లో ప్రవేశించే రుతుపవనాలు సెప్టెంబర్ 17 నుంచి వాయువ్య ప్రాంతాల నుంచి వెనక్కి తగ్గడం ప్రారంభించి, అక్టోబర్ మధ్యనాటికి దేశం పూర్తిగా వీడిపోతాయి. ఎల్ నినో తీవ్రత పెరుగుతుండటమే ఈ పరిస్థితికి ప్రధాన కారణమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సెప్టెంబర్‌లో ఎల్ నినో ప్రభావం మరింత బలపడి, భారతదేశంలో వర్షాలను అణచివేసే అవకాశం ఉందని వారు తెలిపారు. పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడాన్ని ఎల్ నినో అంటారు. ఇది ప్రపంచ వాతావరణ వ్యవస్థను పూర్తిగా తలకిందులు చేసి, ఆగ్నేయాసియా దేశాల్లో వర్షాలు తగ్గేలా చేస్తుంది. గతంలో చాలా ఎల్ నినో సంవత్సరాల్లో భారతదేశం తక్కువ వర్షపాతాన్ని ఎదుర్కొంది. కొన్ని సందర్భాల్లో ఇది తీవ్రమైన కరవులకు సైతం దారితీసి, పంటలను నాశనం చేయడంతో పాటు కొన్ని రకాల ధాన్యాల ఎగుమతులపై ఆంక్షలు విధించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకునేలా చేసింది. జూన్ 1న రుతుపవనాలు ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు దేశంలో సాధారణం కంటే 13 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. జూన్‌లో సాధారణం కంటే 35.4 శాతం తక్కువ వర్షాలు పడగా, జులైలో 1 శాతం అధిక వర్షపాతం నమోదైంది. అయితే ఆగస్టులో రుతుపవనాలు మళ్లీ బలహీనపడటంతో, ఇప్పటివరకు వర్షపాతం 15 శాతం లోటుతో కొనసాగుతోంది.

# కేంద్ర క్యాబినెట్ విస్తరణ..?

మొదటి పేజీ తరువాయి...

సర్దుబాటు చేసేందుకు ఈ విస్తరణ దోహదపడవచ్చని భావిస్తున్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వివిధ రాష్ట్రాల నుండి కొత్త నాయకులను కేబినెట్‌లోకి తీసుకునే అవకాశం ఉందని చర్చ సాగుతోంది. పనితీరు ఆధారంగా కొంతమంది మంత్రుల బాధ్యతల్లో మార్పులు ఉండవచ్చని, మరికొందరికి కొత్త అవకాశాలు దక్కవచ్చని తెలుస్తోంది. త్వరలోనే ఈ ప్రక్రియకు సంబంధించి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



# వైసీపీకి ఎదురుదెబ్బ

**రిట్ పిటీషన్ డిస్మిస్ చేసిన సుప్రీం**

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

సుప్రీంకోర్టులో వైఎస్సార్సీపీకి ఎదురుదెబ్బ తగిలింది. వైఎస్సార్సీపీ, ఆ పార్టీ నేత లేళ్ల అప్పిరెడ్డి వేసిన రిట్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతోనే తమ సోషల్ మీడియా ఖాతాలను నిలిపివేశారని వైఎస్సార్సీపీ, అప్పిరెడ్డి పిటిషన్ వేయగా సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. కర్నూలు 2, గుంటూరు జిల్లాల్లో ఒకటి, సీఐడీ పోలీసులు నమోదు చేసిన మరో క్రిమినల్ కేసును పిటిషన్‌లో ప్రస్తావించారు. ఈ పిటిషన్‌పై వాదనలు వినేందుకు ధర్మాసనం విముఖత చూపింది. ఈ వ్యవహారంలో తాము ఎలాంటి జోక్యం చేసుకోలేమని, పిటిషన్‌ను విచారణకు స్వీకరించలేమని తేల్చి చెప్పింది. ఏమైనా ఇబ్బందులు ఉంటే హైకోర్టుకు వెళ్లాలని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షీల్‌నాగు దర్మాసనం స్పష్టం చేసింది.

# చక్కెరకు ఘాటు!

మొదటి పేజీ తరువాయి...

ముడి చక్కెర టీఆర్ క్యూ దిగుమతులకు ఒక నిర్దిష్ట తుది గడువు ఉండేది. అక్టోబర్ 31, 2026లోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండగా.. తాజాగా ఆ విధానాన్ని మార్చి, ప్రతి సరుకుకు ప్రత్యేకంగా రెండు నెలల కాలపరిమితిని నిర్ణయించింది. దిగుమతి చేసుకున్న ముడి చక్కెర ఎక్కువకాలం నిల్వ ఉండకుండా, వేగంగా శుద్ధి చేసి మార్కెట్లోకి తీసుకురావడమే ఈ మార్పు ఉద్దేశంగా కనిపిస్తోంది. చక్కెర ధరలు సామాన్యులపై అదనపు భారం మోపుతున్నాయి. కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం.. జూలై 20న కిలో చక్కెర సగటు చిల్లర ధర రూ.48.18గా ఉండగా.. ఆగస్టు 20 నాటికి అది రూ.55.70కి చేరింది. అంటే కేవలం నెల రోజుల్లోనే కిలోకు రూ.7.52 పెరిగింది. శాతాల పరంగా చూస్తే ఇది సుమారు 15.6 శాతం పెరుగుదల నమోదు చేసుకుంది.

**ఉత్పత్తి తగ్గడమే కారణమా?**

చక్కెర ధరల పెరుగుదలపై కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి స్పందిస్తూ.. చెరకు, చక్కెర ఉత్పత్తిపై ప్రతికూల వాతావరణ పరిస్థితుల ప్రభావం ఉందని తెలిపారు. ముఖ్యంగా ఎల్‌నినో పరిస్థితులు చెరకు పంటను ప్రభావితం చేశాయని, భారత్‌తో పాటు ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో వ్యవసాయ ఉత్పత్తి దెబ్బతిన్నట్లు వివరించారు. దేశంలో ఏడాదికి సుమారు 28 మిలియన్ టన్నుల చక్కెర అవసరం ఉందని, ప్రస్తుతం దేశం వద్ద 20--25 లక్షల టన్నులకు పైగా అదనపు చక్కెర నిల్వలు ఉన్నాయని కేంద్ర మంత్రి తెలిపారు. దిగుమతి నిబంధనల్లో తాజా మార్పుతో ముడి చక్కెర వేగంగా శుద్ధి అయి మార్కెట్లోకి వస్తే.. సరఫరా పెరిగి ధరలపై ఒత్తిడి తగ్గే అవకాశం ఉంది. అయితే రానున్న రోజుల్లో చక్కెర ధరలు ఎలా మారతాయన్నది దేశీయ ఉత్పత్తి, దిగుమతులు, అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది.

# జుడాల సమ్మె విరమణ

మొదటి పేజీ తరువాయి...

విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా జూడాలు సమ్మె విరమిస్తున్నట్లు న్యాయస్థానానికి తెలియజేశారు. అదే సమయంలో తమ డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకునేలా ఆదేశించాలని కోర్టును కోరారు. జూనియర్ వైద్యుల డిమాండ్లను పరిష్కరించే అంశంపై రెండు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. దీంతో రాష్ట్రంలో జూనియర్ వైద్యుల సమ్మెకు ప్రస్తుతానికి తెరపడినట్లైంది. ం

# ఏకగ్రీవాలు కానివ్వొద్దు

మొదటి పేజీ తరువాయి...

లేకుండా జరిగితే వైసీపీ జెండా ఎగురుతుందని చెప్పారు. దీన్ని గ్రహించిన చంద్రబాబు కచ్చితంగా దుర్మార్గాలకు పాల్పడతారని, అలాగని ఎన్నికలను లైట్ తీసుకోవద్దని నేతలకు హితవు పలికారు. తాడేపల్లిలో వైసీపీ ముఖ్యనేతలతో జరిగిన సమావేశంలో వైఎస్ జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలు గెలుపు ఓటములకు సంబంధించింది కాదని, కార్యకర్తకు పార్టీ అండగా ఉందని చెప్పే సందర్భమని అభిప్రాయపడ్డారు. అందుకే ప్రభుత్వం నుంచి ఎన్ని రకాలుగా ఒత్తిళ్లు, బెదిరింపులు ఉన్నాసరే కచ్చితంగా వైసీపీ మద్దతుదారులకు అండగా నిలవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఆషామాషీగా తీసుకోవద్దని నేతలకు జగన్ హెచ్చరించారు. ఇప్పటికే శాంపిల్‌గా స్థానిక సంస్థల ఎన్నికల్లో దౌర్జన్యం చేశారని ఆరోపించారు. ఇప్పుడు వచ్చే ఎన్నికల్లో కూడా అదే ధోరణి ఉంటుందని చెప్పారు. అలాగని చెప్పి వెనక్కి తగ్గొద్దని చెప్పారు. కార్యకర్తలకు ఇప్పుడు అండగా నిలబడితే రేపు సాధారణ ఎన్నికల్లో వారు పార్టీకి మద్దతుగా ఓట్లు వేయిస్తారని చెప్పుకొచ్చారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి నాయకుడు పని చేయాలని తెలిపారు.

స్థానిక సంస్థలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వైసీపీకి అనుకూలంగా ఉంటుందని జగన్ అభిప్రాయపడ్డారు. ప్రధాన పదవికి బలమైన అభ్యర్థి ఉండేలా చూడాలని చెప్పారు. అవసరం అయితే కుటుంబ సభ్యులను కూడా బరిలో దింపేందుకు వెనుకడుగు వేయొద్దని జగన్ సూచించారు. దీని వల్ల మిగతా వారికి బలం వస్తుందని వివరించారు. ఏకగ్రీవాల విషయంలో చాలా సీరియస్‌గా ఉంటానని జగన్ హెచ్చరించారు. ఏ నియోజకవర్గంలో కూడా ఏకగ్రీవాలకు అంగీకరించవద్దని, కచ్చితంగా రిపోర్టులు తెప్పించుకొని సమీక్షిస్తానని వివరించారు. ఏకగ్రీవాలు ఉన్న నియోజకవర్గాల్లో కోఆర్డినేటర్లపై చర్యలు ఉంటాయని తెలిపారు. దీన్ని సీరియస్‌గా తీసుకోకుండా కార్యకర్తలు తర్వాత పార్టీకి అండగా ఉండేందుకు ముందుకు రారని వివరించారు.

కూటమి ప్రభుత్వానికి, వైసీపీ పాలనకు మధ్య ఉన్న తేడాని ఇంటింటికీ వెళ్లి వివరించాలని నేతలకు జగన్ సూచించారు. దీనికి సంబంధించిన షెడ్యూల్ను విడుదల చేస్తామన్నారు. ప్రచారానికి కావాల్సిన సమాచారం పార్టీ సమకూరుస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే సభ్యత్వం తీసుకున్న వారికి గుర్తింపు కార్డులు సిద్ధమయ్యాయని వెల్లడించారు. గుర్తింపు కార్డులతోపాటు ప్రచార సామగ్రిని కూడా అందజేస్తామన్నారు. గుర్తింపు కార్డుల్లో క్యూఆర్ కోడ్ ఉంటుందని అందులో వారి వివరాలు ఉంటాయన్నారు.

సెప్టెంబరు 5,6,7 తేదీల్లో జిల్లాల స్థాయి సమావేశాలు, సెప్టెంబరు 8,9,10,11 తేదీల్లో అసెంబ్లీ నియోజవకర్గాల స్థాయి సమావేశాలు సెప్టెంబరు 12 నుంచి 22 వరకూ మండల, వార్డు, డివిజన్ స్థాయిల్లో సమావేశాలు నిర్వహిద్దామని జగన్ తెలిపారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో పోటీ లేకుండా చేసేందుకు అధికార పార్టీ దౌర్జానాలకు, అక్రమాలకు దిగుతారని, ఇష్టం వచ్చినట్టు కేసులు పెడతారని కూడా జగన్ హెచ్చరించారు. దీన్ని ఎదుర్కొనేందుకు నియోజకవర్గాల వారీగా బలమైన లీగల్ సెల్, మీడియా సెల్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇది రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి సెల్స్‌తో అనుసంధానమై ఉంటుందన్నారు. అందరూ ఒక యూనిట్‌గా పని చేయాలని హితవుపలికారు. ప్రతి నాయకుడు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండాలని జగన్ చెప్పారు. కేడర్‌ను కూడా తీసుకురావాలని తెలిపారు. దీని కోసం శిక్షణ ఇవ్వాలని, వైసీపీ చేసిన మంచిపనులు, జగన్ 2.0 సూపర్ యాప్, వైఎస్సార్‌సీపీ టాక్స్, సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఇంకా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా లేని వారు గేర్ మార్చాలన్నారు. నేతలంతా ఇగోలు, వ్యక్తిగత విభేదాలు పక్కన పెట్టి పనిచేయాలని పిలుపునిచ్చారు. మరో రెండు మూడు నెలలు నేతలంతా నియోజకవర్గాల్లోనే ఉంటూ స్థానిక సంస్థల్లో జెండా ఎగరేలా చూడాలని దిశానిర్దేశం చేశారు.

# గోదావరి జలాలతో ఉత్తరాంధ్రకు కొత్త వెలుగు





### పోలవరం ఎడమ కాలువ జలహారతి కార్యక్రమానికి సీఎం చంద్రబాబు రాక

### ఏర్పాట్లను పరిశీలించిన హోం మంత్రి అనిత

**పాయకరావుపేట, ఆగస్టు 25 (జయ జయహే)**

పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు అందించే చారిత్రాత్మక ఘట్టానికి ప్రభుత్వం సర్వం సిద్ధం చేస్తోంది. పోలవరం ఎడమ కాలువ జలహారతి కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. పాయకరావుపేట మండలం సీతారాంపురం నుంచి పీఎల్‌పురం, పాయకరావుపేట ప్రాంతాల వరకు పోలవరం ఎడమ కాలువ ద్వారా నీటి విడుదలకు సంబంధించిన ప్రాంతాలను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పరిశీలించారు. జలహారతి కార్యక్రమానికి చేపడుతున్న ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణ, నీటి విడుదల ప్రాంతం, భద్రత, ప్రజల సౌకర్యాలు తదితర అంశాలపై హోం మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేయడం ఉత్తరాంధ్ర రైతాంగానికి ఎంతో మేలు చేసే చారిత్రాత్మక ఘట్టమని మంత్రి అనిత పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా రైతులు ఎదురుచూస్తున్న కల సాకారం కాబోతోందన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో సుమారు 35 వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. గోదావరి జలాల రాకతో ఉత్తరాంధ్రలో సాగు విస్తీర్ణం మరింత పెరగడంతో పాటు రైతులకు సాగునీటి భద్రత కలుగుతుందన్నారు. ప్రస్తుతం సూపర్ ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో సాగునీటి లభ్యత రైతాంగానికి ఎంతో ఊరటనిస్తుందని హోం మంత్రి తెలిపారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలు అందుబాటులోకి వస్తే తాండవ, వరాహ, శారదా నదులకు కూడా నీటి లభ్యత పెరిగే పరిస్థితులు ఏర్పడతాయని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబుని 'అపర భగీరథుడు'గా అభివర్ణించిన అనిత.. ఎన్నో సంవత్సరాలుగా సాధ్యం కాని పనిని ఆయన సంకల్పంతో సాకారం చేస్తున్నారన్నారు. గోదావరి జలాలు ఉత్తరాంధ్ర పంట పొలాలకు చేరడం చరిత్రలో నిలిచిపోయే ఘట్టమని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు గోదావరి జలాలకు ఘన స్వాగతం పలకాలని ఆమె పిలుపునిచ్చారు.గోదావరి జలాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని హోం మంత్రి అనిత కోరారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్,జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్,పోలవరం ఇరిగేషన్ ఎస్ ఇ ఏసుబాబు, అడురోడ్డు ఆర్ డి ఓ రామలక్ష్మి పాల్గొన్నారు.



## ప్రజలందరి జీవితాల్లో

# వెలుగులు నిండాలి

### "మిలాద్ ఉన్ నబీ " శుభాకాంక్షలు తెలిపిన మంత్రి ఎన్ఎండి ఫరూక్

**అమరావతి, ఆగస్టు25 (జయ జయహే )**

ప్రతి ఒక్కరి జీవితంలో శాంతి, సంతోషం, ఆరోగ్యం, సౌభాగ్యం నిండాలని కోరుకుంటూ అందరికీ మిలాద్ ఉన్ నబీ పర్వదిన శుభాకాంక్షలను మైనారిటీ,న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు.ముస్లిం సమాజంలో ఎంతో పవిత్రంగా భావించే పండుగల్లో మిలాద్ ఉన్ నబీ ఒకటని మంగళవారం అమరావతి లో విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ప్రవక్త మహమ్మద్ జన్మదినాన్ని స్మరించుకుంటూ ఈ రోజును భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని అన్నారు. ప్రవక్త మహమ్మద్ జీవితాన్ని, బోధనలను పాటిస్తూ, ఆదర్శంగా నిలవాలని అన్నారు.నిజాయితీ, దయ, క్షమ, ప్రేమ, సహనం, ఇతరులకు సహాయం చేయడం వంటి విలువలకు ప్రవక్త ఇచ్చిన ప్రాధాన్యతను ఆదర్శంగా తీసుకోవాలని కోరుతూ మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు మంత్రి ఫరూక్ తెలిపారు.



## మండలాల విలీనంపై డీపీఓతో

# చర్చించిన గంటా

**విశాఖపట్నం, ఆగస్టు 25: (జయ జయహే)**

జిల్లాలోని 4 మండలాలను జీవీఎంసీలో కలిపేందుకు నిర్వహిస్తున్న గ్రామసభల వివరాలు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆరా తీశారు. ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ మంగళవారం ఆయన్ను కలిశారు. విలీన ప్రక్రియలో భాగంగా గ్రామ సభల్లో చేసిన తీర్మానాలు ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. కోర్టు కేసుల వివరాలు కూడా గంటా అడిగి తెలుసుకున్నారు. అలాగే మధురవాడ జోన్ లో హౌసింగ్ గురించి జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడుతో చర్చించారు. ప్రభుత్వం కేటాయించిన ఫ్లాట్ లలో నివాసముంటున్న అనర్హుల వివరాలు సేకరించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



# అప్పలరాజు ఎలా ఉన్నావ్

### సీఎం పలకరింపుతో కార్యకర్తల్లో జోష్

**మాడుగుల ఆగస్టు 24 జయజయహే**

అప్పలరాజు ఎలా ఉన్నారు.. అంతా ఓకేనా అన్న సీఎం చంద్రబాబు పలకరింపు మాడుగుల మండలం తెలుగుదేశం పార్టీ కార్యకర్తల్లో జోష్ నింపింది. ఈనెల 22న మాడుగుల నియోజవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటించిన సందర్భంగా మాడుగుల మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు ఆయనను హెలిపాడ్ వద్ద కలసి స్వాగతించారు. అప్పలరాజును చూసి చూడగానే పేరు పెట్టి పలకరించడంతో ఆయనతోపాటు ఆ చుట్టూ ఉన్న విఐపి లందరూ ఆశ్చర్యా పడ్డారు. ఒకప్పుడు మాజీ మంత్రి స్వర్గీయ రెడ్డి సత్యనారాయణతో తరచుగా చంద్రబాబు ను అప్పలరాజు కలుస్తూ కొన్ని సమస్యలపై చర్చించేవారు. అయితే 15 సంవత్సరాల నుంచి చంద్రబాబును కలవక పోయినప్పటికీ గుర్తుపెట్టుకుని మరి పలకరించడం ఆయనకున్న జ్ఞాపకశక్తికి నిదర్శనమని తెలుగుదేశం వర్గాలు కొనియాడుతున్నాయి. ఈ వయసులో కూడా ఎప్పుడో కలిసిన వ్యక్తులను గుర్తుపెట్టుకోవడం విజన్ ముఖ్యమంత్రిగా చంద్రబాబుకు చెల్లిందని కొనియాడారు. ఈ సందర్భంగా అప్పల్రాజు మాట్లాడుతూ సీఎం తనను పేరు పెట్టి పిలవడం తనకే ఆశ్చర్యం కలిగించిందని, ఆ సమయంలో చుట్టువున్నన్నవారు కూడా నా వైపు చూసి కొనియాడారన్నారు. చక్కని పాలనా దక్షుడు మనకి ముఖ్యమంత్రి కావడం తెలుగు ప్రజల అదృష్టమన్నారు.



## మాజీ సీఎం జగన్‌ను కలిసిన

# బొడ్డేడ ప్రసాద్

**మునగపాక, ఆగస్టు 25, జయ జయహే:**

తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం అనంతరం పార్టీ అధినేతమాజీ సీఎం మాజీ ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన వైఎస్సార్సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్. పార్టీ అధినేత జగన్ కలిసిన వారిలో అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్, మాజీ మంత్రి రామానాయుడు, మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్ తదితరులు ఉన్నారు. అనకాపల్లి జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ నాయకత్వంలో వీరంతా పార్టీ అధినేత జగన్ ను కలిసి అనకాపల్లి, విశాఖ జిల్లాలో పార్టీ పరిస్థితి గురించి చర్చించారు.

## మాజీ సీఎం జగన్‌ను కలిసిన కె.కె రాజు

**తాడేపల్లి (జయ జయహే)**



వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డి ని తాడేపల్లి కేంద్ర పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కె.కె రాజు ఈ సందర్భంగా విశాఖపట్నం జిల్లా రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతం మరియు పార్టీ కమిటీలు నిర్మాణం, ఐడి కార్డుల వెరిఫికేషన్ గురించి చర్చించారు..

# మేయర్ ఎన్నికల్లో భారీ మెజారిటీ ఖాయం

### - పోటీలో నేను వద్దా అంటూ గంటా సరదా వ్యాఖ్య

### - జీవీఎంసీలో విలీనానికి 79 గ్రామాలు

**విశాఖపట్నం, ఆగస్టు 24, జయ జయహే**



జీవీఎంసీ ఎన్నికల్లో మేయర్ స్థానాన్ని భారీ మెజారిటీతో కైవసం చేసుకుంటామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ విశాఖ ప్రజలు సీఎం చంద్రబాబు నాయుడిని అభిమానిస్తారని, 2019 లో రాష్ట్రమంతా వైసీపీ హవా నడిచినప్పటికీ విశాఖలోని నాలుగు దిక్కులు ఆయన వెంట నడిచాయన్నారు. గత ఎన్నికల్లో గాజువాక, భీమిలి, పెందుర్తి అసెంబ్లీ స్థానాల నుంచి రాష్ట్రంలో మొదటి, రెండు, నాలుగవ అత్యధిక మెజారిటీలు సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం ఐటీ, టూరిజం, రియల్ ఎస్టేట్ రంగాల్లో విశాఖను శరవేగంగా అభివృద్ధి చేస్తోందని చెప్పారు. జీవీఎంసీలో విలీనానికి అనుకూలంగా భీమిలి రూరల్, ఆనందపురం, పద్మనాభం, పెందుర్తి మండలాల్లోని 79 గ్రామ పంచాయతీల గ్రామ సభల్లో తీర్మానాలు చేస్తున్నారని చెబుతూ.. ఇంతకుముందే భీమిలి నియోజకవర్గానికి చెందిన 3 మండలాల్లో ఇదే నిర్ణయాన్ని లేఖ రూపంలో ఇచ్చామని పేర్కొన్నారు. భోగాపురం మండలాన్ని జీవీఎంసీలో కలపాలన్న ప్రతిపాదన గురించి ప్రస్తావిస్తూ ఈ విషయమై నెల్లిమర్ల ఎమ్మెల్యే మాధవి నాయకులతో చర్చించి తన నిర్ణయం చెబుతానని గతంలో చెప్పారన్నారు. భోగాపురం జీవీఎంసీలో కలిస్తే బాగుంటుందనేది వ్యక్తిగత అభిప్రాయమని చెప్పారు. తన తనయుడు గంటా రవితేజ మేయర్ రేసులో ఉన్నారా అని ప్రశ్నించగా.. నేను పోటీ చేయవద్దా? అని సరదాగా వ్యాఖ్యానించారు. అభ్యర్థి ఎంపికకు ఇంకా చాలా సమయముందని, అధిష్టానం నిర్ణయం శిరోధార్యమన్నారు. ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యానికి మించి డేటా సెంటర్ల ప్రతిపాదనలు వచ్చినా అంగీకరించేది లేదని మంత్రి నారా లోకేష్ ఇప్పటికే స్పష్టం చేశారని తెలియజేశారు. డేటా సెంటర్లకు అవసరమైన నీరు, విద్యుత్తు కోసం ప్రభుత్వ ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తుందన్నారు



# 5 రోజులపాటు సోప్ క్యాంప్

**విశాఖపట్నం (జయ జయహే)**

విశాఖ జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాధికారి మరియు జిల్లా చీఫ్ కమిషనర్ ఎన్. ప్రేమా కుమార్ ఆదేశాలతోపి పాఠశాలలకు ప్రవేశ నుంచి ద్వితీయ సోప్ క్యాంపును ఐదు రోజుల పాటు సౌత్ కోస్ట్ రైల్వే క్యాంపింగ్ సెంటర్ నందు ఈ నెల 25 నుండి 29 వరకు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దాసరి వేణుగోపాల్, జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ మారుతి హరీష్ కుమార్, డి. సుభద్ర దేవి, ఎస్. హేమంత్, కె. శ్రావణి, వై. నంద కుమారి, దుర్గా ప్రసాద్, సతీష్, రామ చంద్ర రెడ్డి, ఎస్. చిన్నతల్లి స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు

For a pure tomorrow.. జయహో

## పరిశ్రమల్లో భద్రత

# గాలిలో దీపమేనా?

(హెచ్. ప్రతాప్)

ఒక పరిశ్రమకు అనుమతి ఇవ్వడం అంటే కేవలం భూమి, పెట్టుబడి, ఉత్పత్తి సామర్థ్యానికి అనుమతి ఇవ్వడం కాదు. అక్కడ పనిచేసే ప్రతి కార్మికుడు సాయంత్రం సురక్షితంగా ఇంటికి చేరుతాడనే హామీకి కూడా అనుమతి ఇవ్వడం. పరిశ్రమలు వేగంగా విస్తరిస్తున్న తెలంగాణలో ఇప్పుడు ఈ భద్రతా ప్రమాణాన్ని మరింత గట్టిగా పట్టుకోవాల్సిన అవసరం కనిపిస్తోంది. పెట్టుబడుల వేగానికి పారిశ్రామిక భద్రతా వ్యవస్థ కూడా అదే వేగంతో పరుగెత్తకపోతే అభివృద్ధి అసంపూర్ణమే. ఆగస్టు 21 రాత్రి యాదాద్రి-భువనగిరి జిల్లా పాచంపల్లి మండలం దోతిగూడెంలోని ఔషధ తయారీ సంస్థ హేజిలో ల్యాబ్‌లో రియాక్టర్ పేలింది. రాత్రి 10.27 గంటలకు పేలుడు సంభవించిన సమయంలో యూనిట్‌లో 12 మంది కార్మికులు విధుల్లో ఉన్నారు. అనంతరం మంటలు వ్యాపించడంతో ఇద్దరు కార్మికులు మరణించగా, తొమ్మిది మంది గాయపడ్డారు. వారిలో ఇద్దరికి తీవ్ర కాలిన గాయాలున్నట్లు సమాచారం. అగ్నిమాపక బృందాలు గంటల తరబడి శ్రమించి తెల్లవారుజామున మంటలను అదుపులోకి తెచ్చాయి. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు కొనసాగుతోంది.

ఈ వివరాలు ఒక ప్రమాద నివేదికగా ముగిసిపోవచ్చు. కానీ ప్రశ్న అంతకంటే పెద్దది---ఇలాంటి ప్రమాదాలు ఎందుకు పునరావృతమవుతున్నాయి? 2025 జూన్‌లో సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన భారీ పేలుడు 46 మంది ప్రాణాలను బలిగొంది. ఆ విషాదం నుంచి నేర్చుకున్న పాఠాలు ప్రతి అధిక ప్రమాద పరిశ్రమలో అమలయ్యాయా అన్నది ఇప్పుడు పరిశీలించాల్సిన అవసరం ఉంది.

రసాయన, ఔషధ, పెట్రోకెమికల్, గ్యాస్, ఎరువుల పరిశ్రమల్లో సాధారణ తనిఖీలు సరిపోవు. రియాక్టర్ ఉష్ణోగ్రత, పీడనం, రసాయన ప్రతిచర్యలు, వాయు లీకేజీలను నిరంతరం పర్యవేక్షించే స్వయంచాలక భద్రతా వ్యవస్థలు తప్పనిసరి కావాలి. కృత్రిమ మేధస్సు ఆధారిత పర్యవేక్షణ ద్వారా అసాధారణ మార్పులను ముందుగానే గుర్తించి హెచ్చరికలు ఇవ్వడం, అవసరమైతే యంత్రాన్ని స్వయంచాలకంగా నిలిపివేయడం సాధ్యమే.

ప్రతి జిల్లాలో పరిశ్రమల భద్రతా మండలి ఏర్పాటు చేయాలి. అధిక ప్రమాద పరిశ్రమలను ప్రత్యేక జాబితాలో ఉంచి, వాటికి స్వతంత్ర భద్రతా తనిఖీలు, కాలానుగుణ ప్రమాద అంచనాలు, అత్యవసర విన్యాసాలు తప్పనిసరి చేయాలి. పరిశ్రమల శాఖతో పాటు కార్మిక, అగ్నిమాపక, విపత్తు నిర్వహణ విభాగాలు, స్వతంత్ర భద్రతా నిపుణులు ఇందులో భాగస్వాములు కావాలి.

ఇక బాధ్యత విషయంలో స్పష్టత అవసరం. తీవ్రమైన నిర్లక్ష్యం లేదా ఉద్దేశపూర్వక భద్రతా ఉల్లంఘన కారణంగా ప్రాణాంతక ప్రమాదం జరిగినట్లు నిర్ధారణ అయితే కేవలం జరిమానాతో వ్యవహారం ముగియకూడదు. కార్యకలాపాల నిలిపివేత, లైసెన్స్ సస్పెన్షన్, స్వతంత్ర భద్రతా ధృవీకరణ తర్వాతే పునఃప్రారంభం వంటి చర్యలు ఉండాలి. పునరావృతంగా తీవ్రమైన ఉల్లంఘనలు చేసే సంస్థల లైసెన్స్ రద్దును కూడా చట్టపరంగా పరిశీలించాలి.

అదే సమయంలో కార్మికుడికి "ప్రమాదం కనిపిస్తే పని నిలిపివేయమని చెప్పే హక్కు" ఉండాలి. భద్రతా లోపాలను గోప్యంగా నివేదించే వ్యవస్థ, వ్యక్తిగత రక్షణ పరికరాలు, క్రమం తప్పని శిక్షణ, అగ్నిప్రమాద--రసాయన లీకేజీ విన్యాసాలు తప్పనిసరి కావాలి.

ప్రమాదం తర్వాత పరిహారం ఇవ్వడం అవసరం. కానీ పరిహారం ప్రాణాన్ని తిరిగి తీసుకురాదు. అందుకే ప్రభుత్వాలు, పరిశ్రమలు కలిసి "ప్రమాదం తర్వాత చర్య" నుంచి "ప్రమాదానికి ముందు నివారణ" వైపు మారాలి.

పరిశ్రమలు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి అవసరం. పెట్టుబడులు రావాలి, ఉపాధి పెరగాలి, ఉత్పత్తి విస్తరించాలి. కానీ ఆ అభివృద్ధికి కార్మికుడి ప్రాణం మూలధనం కాకూడదు. భద్రత పరిశ్రమకు అదనపు ఖర్చు కాదు; పరిశ్రమ కొనసాగడానికి చెల్లించాల్సిన కనీస బాధ్యత. ఉత్పత్తి పెరగడం అభివృద్ధి అయితే, కార్మికుడు క్షేమంగా ఇంటికి చేరడం ఆ అభివృద్ధికి అసలైన కొలమానం.

## అప్రమత్తతతో శాంతి..

# సహకారంతో అభివృద్ధి

(ప్రతాప్)

భారత్--చైనా సంబంధాల్లో సరిహద్దు అంశం మరోసారి ప్రాధాన్యం సంతరించుకుంది. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ బీజింగ్‌లో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో 25వ విడత ప్రత్యేక ప్రతినిధుల చర్చల్లో పాల్గొంటున్నారు. వాస్తవాధీన రేఖ వద్ద శాంతి, స్థిరత్వం కొనసాగించడం, మిగిలిన సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించడం ఈ సంప్రదింపుల ప్రధాన ఉద్దేశం.

భారత్--చైనా సరిహద్దు సమస్యకు ప్రధాన కారణం ఇరు దేశాల మధ్య పూర్తిగా ఖరారైన సరిహద్దు రేఖ లేకపోవడం. వాస్తవాధీన రేఖపై ఇరు దేశాల అవగాహన కొన్ని ప్రాంతాల్లో భిన్నంగా ఉండటంతో గస్తీ హక్కులు, సైనిక కదలికలు, భూభాగంపై అభిప్రాయ భేదాలు తలెత్తుతున్నాయి. పశ్చిమ ప్రాంతంలోని లడఖ్, అక్సాయ్‌చిన్, తూర్పున అరుణాచల్‌ప్రదేశ్ వంటి ప్రాంతాలు దీర్ఘకాలంగా వివాదానికి కేంద్రంగా ఉన్నాయి.

2020లో తూర్పు లడఖ్‌లో జరిగిన పరిణామాలు ఇరు దేశాల సంబంధాలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఆ తరువాత సైనిక మోహరింపులు పెరిగాయి, పరస్పర విశ్వాసం దెబ్బతింది. అయితే గత కొంతకాలంగా దౌత్య, సైనిక స్థాయిల్లో చర్చలు కొనసాగుతున్నాయి. 2024లో డెప్సాంగ్, డెమ్‌చోక్ ప్రాంతాల్లో గస్తీకి సంబంధించిన అవగాహన కుదరడం, తదనంతరం అక్కడి పరిస్థితుల్లో మెరుగుదల రావడం సానుకూల పరిణామాలు.

అయితే సరిహద్దు సమస్య పూర్తిగా పరిష్కారమైనట్లు భావించడం తొందరపాటు. సరిహద్దు నిర్ధారణ, గస్తీ విధానాలు, మౌలిక వసతుల నిర్మాణం, సైనిక మోహరింపులు, అరుణాచల్‌ప్రదేశ్‌పై చైనా వాదనలు వంటి అంశాలపై ఇంకా స్పష్టమైన పరిష్కారం అవసరం. అందుకే నిరంతర సంభాషణకు ప్రాధాన్యం ఉంది.

ఇదే సమయంలో భారత్--చైనా సంబంధాలను కేవలం సరిహద్దు కోణంలో చూడటం కూడా సముచితం కాదు. ఇరు దేశాలు పెద్ద ఆర్థిక వ్యవస్థలు. వాణిజ్యం, తయారీ, సరఫరా వ్యవస్థలు, ఔషధాలు, సాంకేతిక రంగాలు, పర్యాటకం, విద్య, ప్రజల మధ్య సంబంధాలు వంటి అనేక రంగాల్లో పరస్పర ప్రయోజనాలకు అవకాశాలున్నాయి. ఇటీవల ఇరు దేశాలు ప్రత్యక్ష విమానాలను పునరుద్ధరించడం, వాణిజ్య--పెట్టుబడి సంబంధాలను పెంచే దిశగా చర్యలు తీసుకోవడం సంబంధాల్లో మార్పుకు సంకేతంగా కనిపిస్తోంది.

సంబంధాలు మెరుగుపడితే భారత్‌కు స్థిరమైన వాణిజ్య వాతావరణం, అవసరమైన పారిశ్రామిక వస్తువులు, పెట్టుబడులు, సాంకేతిక సహకారం వంటి ప్రయోజనాలు లభించవచ్చు. చైనాకు కూడా భారతదేశంలోని విస్తరిస్తున్న మార్కెట్, పెట్టుబడి అవకాశాలు, నైపుణ్యవంతమైన మానవ వనరులు, వేగంగా అభివృద్ధి చెందుతున్న వినియోగదారుల ఆర్థిక వ్యవస్థతో అనుసంధానం ప్రయోజనకరం. పోటీ ఉన్నప్పటికీ పరస్పర సహకారానికి చోటు కల్పించడం ఇరు దేశాల ఆర్థిక వృద్ధికి తోడ్పడుతుంది. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య సంబంధాలను క్రమంగా సాధారణీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తాజా పరిణామాలు సూచిస్తున్నాయి.

అయితే ఆర్థిక సహకారం పెరగాలంటే ముందుగా విశ్వాసం పెరగాలి. సరిహద్దులో శాంతి, స్పష్టమైన నియమాలు, నిరంతర సైనిక--దౌత్య సంప్రదింపులు ఆ విశ్వాసానికి పునాది. శాంతి కోసం ప్రయత్నించడం భద్రత విషయంలో రాజీపడటం కాదు; భద్రతను కాపాడుకుంటూనే సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవడం. భారత్--చైనా సంబంధాల్లో ప్రతి సమస్యకు వెంటనే పరిష్కారం దొరకకపోవచ్చు. కానీ సంభాషణ ఆగకుండా ఉంటే అపార్థాలు తగ్గుతాయి, ఉద్రిక్తతలు నియంత్రణలో ఉంటాయి, సహకారానికి కొత్త అవకాశాలు ఏర్పడతాయి. సరిహద్దులో ప్రశాంతత.. సంబంధాల్లో విశ్వాసం.. ఆర్థిక రంగంలో సహకారం--- ఈ మూడు కలిసి ముందుకు సాగితే భారత్‌కే కాదు, మొత్తం ఆసియా ప్రాంతానికి కూడా అది మేలు చేస్తుంది.

# హిందుత్వ స్వప్నం-స్వేచ్ఛా తరం: అవకాశాలు, సవాళ్లు

## ఒకవైపు సాంస్కృతిక పునరుజ్జీవనం.. మరోవైపు స్వేచ్ఛ, సమానత్వం కోరుతున్న కొత్త తరం

**భారతదేశం ప్రస్తుతం ఒక ఆసక్తికరమైన సామాజిక మలుపులో ఉంది. ఒకవైపు భారతీయ సంస్కృతి, సంప్రదాయం, హిందుత్వ భావనలను కేంద్రంగా చేసుకుని దేశ సామాజిక జీవనాన్ని పునర్నిర్వచించాలనే ఆకాంక్ష పెరుగుతోంది. మరోవైపు ప్రపంచీకరణ, ఆధునిక విద్య, సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక స్వావలంబన, పాశ్చాత్య ఆలోచనా విధానాలతో పరిచయం పొందిన యువతరం వ్యక్తిగత స్వేచ్ఛ, సమానత్వం, మానవ హక్కులు, వ్యక్తిత్వం వంటి విలువలకు మరింత ప్రాధాన్యం ఇస్తోంది.**



ముఖ్యంగా మహిళలు విద్య, ఉద్యోగం, ఆర్థిక స్వాతంత్ర్యం, సామాజిక చైతన్యం ద్వారా తమ జీవితాలపై నిర్ణయం తీసుకునే హక్కును బలంగా కోరుతున్నారు. అదే సమయంలో దళితులు, ఆదివాసీలు, మతపరమైన మరియు ఇతర సామాజిక మైనారిటీలు---తమ రాజ్యాంగ హక్కులు, సమాన పౌరసత్వం, సామాజిక న్యాయం, సాంస్కృతిక స్వాతంత్ర్యం వంటి అంశాలపై ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

అందువల్ల నేటి ప్రశ్న కేవలం "హిందుత్వమా? పాశ్చాత్య ఆధునికతా?" అనే ద్వంద్వం కాదు. " భారతీయ సాంస్కృతిక గుర్తింపును బలోపేతం చేస్తూనే సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయాన్ని ఎలా కాపాడుకోవాలి? " అనేదే అసలు సవాలు.

### హిందుత్వ స్వప్నం అంటే ఏమిటి?

హిందుత్వం అనే పదానికి రాజకీయ, సాంస్కృతిక, తాత్విక సందర్భాల్లో భిన్నమైన అర్థాలు ఉన్నాయి. కొందరికి అది భారతీయ నాగరికత, సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీక. మరికొందరికి అది ఒక రాజకీయ సిద్ధాంతం. ఇంకొందరు దానిని భారతీయ సమాజాన్ని ఒక సాంస్కృతిక గుర్తింపు చుట్టూ ఏకం చేసే భావనగా చూస్తారు.

ఈ విభిన్న అర్థాలను ఒకే నిర్వచనంలో బంధించడం సులభం కాదు.

అయితే భారతదేశంలో హిందుత్వ ఆధారిత సామాజిక--రాజకీయ ఆలోచన బలపడుతున్న నేపథ్యంలో, ఒక ముఖ్యమైన ప్రశ్న ముందుకు వస్తోంది: భారతీయతకు ఒకే సాంస్కృతిక నిర్వచనం ఉండాలా? లేక భారతీయత అనేది అనేక సంస్కృతులు, మతాలు, కులాలు, భాషలు, సంప్రదాయాల సమ్మేళనమా?

ఈ ప్రశ్నకు సమాధానం భారత ప్రజాస్వామ్య భవిష్యత్తుతో ముడిపడి ఉంది.

### పాశ్చాత్య ఆలోచనల ప్రభావంతో పెరిగిన యువతరం

నేటి యువతరం ప్రపంచాన్ని ఒకే దేశం లేదా ఒకే సంస్కృతి పరిధిలో చూడడం లేదు. ఇంటర్నెట్, సోషల్ మీడియా, విదేశీ విద్య, బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు, అంతర్జాతీయ ప్రయాణాలు---ఇవన్నీ యువత ఆలోచనా పరిధిని విస్తరించాయి.

స్వేచ్ఛ, వ్యక్తిగత హక్కులు, లింగ సమానత్వం, వ్యక్తిత్వ స్వాతంత్ర్యం, ప్రేమ మరియు వివాహంలో ఎంపిక, వృత్తి స్వేచ్ఛ వంటి అంశాలపై యువతరం మరింత బహిరంగంగా మాట్లాడుతోంది.

ఇందులో ముఖ్యమైన మార్పు మహిళల విషయంలో కనిపిస్తోంది.

ఒకప్పుడు కుటుంబ నిర్ణయాలే ఆమె జీవితానికి దిశానిర్దేశం చేసేవి. ఇప్పుడు ఆమె తన విద్యను, ఉద్యోగాన్ని, జీవన విధానాన్ని, వివాహాన్ని, కుటుంబ పరిమాణాన్ని, తన వ్యక్తిగత లక్ష్యాలను తానే నిర్ణయించుకోవాలనుకుంటోంది.

స్వేచ్ఛను ఒకసారి అనుభవించిన వ్యక్తిని పాత నియంత్రణలకు తిరిగి తీసుకెళ్లడం అంత సులభం కాదు.

### మహిళ: సంప్రదాయానికి ప్రతీకా? స్వేచ్ఛకు ప్రతీకా?

భారతీయ సామాజిక చర్చల్లో మహిళను తరచుగా "సంస్కృతి పరిరక్షకురాలు"గా చిత్రిస్తారు. కుటుంబ సంప్రదాయాలు, ఆచారాలు, మతపరమైన విలువలను కాపాడే బాధ్యతను ఆమెపై ఉంచుతారు.

కానీ అదే సమయంలో ఆమె వ్యక్తిగత స్వేచ్ఛకు పరిమితులు విధిస్తే విరుద్ధ పరిస్థితి ఏర్పడుతుంది.

ఆమె ఎలాంటి దుస్తులు ధరించాలి?

ఎవరిని వివాహం చేసుకోవాలి?

ఉద్యోగం చేయాలా, వద్దా?

ఎక్కడ నివసించాలి?

ఎప్పుడు పిల్లలను కనాలి?

తన శరీరం, తన జీవితంపై నిర్ణయం ఎవరిది?

ఇవి కేవలం కుటుంబ ప్రశ్నలు కావు. ఇవి వ్యక్తిగత హక్కుల ప్రశ్నలు.

సంప్రదాయాన్ని గౌరవించాలనే పేరుతో మహిళా స్వేచ్ఛను తగ్గించడం ఎంతవరకు సమంజసం? అదే సమయంలో పాశ్చాత్య జీవనశైలిని స్వేచ్ఛకు ఏకైక ప్రమాణంగా చూడటం కూడా ఎంతవరకు సమంజసం? ఇక్కడే సమతుల్యత అవసరం.

### దళితుల ప్రశ్నను విస్మరించగలమా?

హిందుత్వం ఆధారంగా భారతీయ సమాజాన్ని పునర్నిర్మించాలనే ఆలోచనపై దళిత సమాజంలోని కొన్ని వర్గాలు ప్రశ్నలు లేవనెత్తే అవకాశం ఉంది. కారణం భారతీయ సామాజిక చరిత్రలో కుల అసమానతకు ఉన్న దీర్ఘ చరిత్ర. దళిత ఆలోచనలో ప్రధానంగా వినిపించే ప్రశ్న:

"సంప్రదాయ భారతీయ సమాజాన్ని పునరుద్ధరించాలంటే ఏ సంప్రదాయాన్ని పునరుద్ధరిస్తున్నారు?"

ఎందుకంటే గతంలో కుల ఆధారిత వివక్ష, అంటరానితనం, సామాజిక వెలివేత వంటి అనుభవాలు అనేక అణగారిన వర్గాలకు వాస్తవం. అందువల్ల "సాంస్కృతిక పునరుజ్జీవనం" అనే భావన దళితుల దృష్టిలో సామాజిక సమానత్వం, కుల నిర్మూలన, గౌరవం, అవకాశాల సమానత్వంతో అనుసంధానమైతేనే ఆమోదయోగ్యంగా ఉంటుంది.

అంబేద్కర్ ఆలోచనా సంప్రదాయం ప్రభావంతో ఉన్న దళిత దృక్పథం ప్రత్యేకంగా రాజ్యాంగం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలకు ప్రాధాన్యం ఇస్తుంది. అందువల్ల హిందుత్వ పునరుజ్జీవనానికి ఎదురయ్యే ముఖ్యమైన ప్రశ్నల్లో ఒకటి: "సాంస్కృతిక ఏకత్వంతో పాటు సామాజిక సమానత్వాన్ని ఎలా నిర్ధారిస్తారు?"

### మైనారిటీల ఆందోళనలు

ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు మరియు ఇతర మత--సాంస్కృతిక సమూహాలు భారతదేశపు బహుళత్వంలో భాగాలు. హిందుత్వాన్ని భారతీయ నాగరికతకు సమానార్థకంగా నిర్వచించే ప్రయత్నం జరిగితే, కొన్ని మైనారిటీ వర్గాల్లో తమ మతపరమైన గుర్తింపు, సాంస్కృతిక స్వాతంత్ర్యం, సమాన పౌరసత్వంపై ఆందోళనలు తలెత్తవచ్చు. వారి ప్రశ్న కూడా సహజమే: "భారతీయతను ఒకే మత--సాంస్కృతిక గుర్తింపుతో నిర్వచిస్తే, మిగిలినవారి భారతీయతకు స్థానం ఎక్కడ?"

భారత రాజ్యాంగం భారతదేశాన్ని విభిన్నతలతో కూడిన ప్రజాస్వామ్యంగా నిర్మించింది. కాబట్టి సాంస్కృతిక మెజారిటీ భావనతో పాటు మైనారిటీల హక్కుల రక్షణ కూడా సమానంగా ముఖ్యం.

### హిందుత్వం--మైనారిటీలు తప్పనిసరిగా విరోధులేనా?

అలా చూడటం కూడా సరళీకరణే. హిందుత్వ భావనను భారతీయ నాగరికత, సంస్కృతి, ఆధ్యాత్మికత, దేశభక్తి వంటి విస్తృత సాంస్కృతిక భావనగా అర్థం చేసుకునే వారు, అది ఏ మతానికీ వ్యతిరేకం కాదని వాదించవచ్చు. అదే సమయంలో మైనారిటీలు కూడా తమ మతపరమైన గుర్తింపును కాపాడుకుంటూనే భారతీయ జాతీయతలో భాగస్వాములు కావచ్చు. అందువల్ల అసలు సమస్య హిందుత్వం ఉందా లేదా? అన్నది మాత్రమే కాదు.

### హిందుత్వం భారతదేశంలోని వైవిధ్యాన్ని ఎలా చూస్తుంది?

మైనారిటీలు భారతీయ సాంస్కృతిక ప్రవాహంలో తమ స్థానాన్ని ఎలా చూస్తారు?

రాజ్యాంగ సమానత్వం మరియు సాంస్కృతిక మెజారిటీ మధ్య సమతుల్యత ఎలా సాధ్యమవుతుంది?

ఇవే కీలక ప్రశ్నలు.

### సంప్రదాయం పేరుతో కులవ్యవస్థకు చోటుందా?

ఇది అత్యంత సున్నితమైన ప్రశ్న. భారతీయ సంప్రదాయంలో ఉన్న కుటుంబ విలువలు, ఆధ్యాత్మికత, సామూహిక జీవనం, ప్రకృతితో అనుబంధం వంటి అంశాలను కాపాడుకోవాలనుకోవచ్చు. కానీ అదే సమయంలో కుల వివక్ష, అంటరానితనం, స్త్రీ అసమానత్వం వంటి అన్యాయాలను "సంప్రదాయం" పేరుతో సమర్థించలేం. "సంప్రదాయంలో మంచిని స్వీకరించాలి; అన్యాయాన్ని పునరుద్ధరించకూడదు." ఇదే ఆధునిక భారతీయతకు కీలకమైన పరీక్ష.

### యువతరం ముందున్న మరో సవాలు

పాశ్చాత్య ఆలోచనలను స్వీకరించడం అంటే పాశ్చాత్య సమాజంలోని ప్రతి అంశాన్ని అనుకరించడం కాదు.

వ్యక్తిగత స్వేచ్ఛతో పాటు ఒంటరితనం, వినియోగవాదం, కుటుంబ బంధాల బలహీనత వంటి సమస్యలు కూడా కొన్ని ఆధునిక సమాజాల్లో కనిపిస్తాయి. అందువల్ల భారతీయ యువతరం అనుకరణ కాకుండా ఎంపిక నేర్చుకోవాలి .

ప్రపంచం నుంచి నేర్చుకోవాలి. కానీ తన సమాజాన్ని కూడా విమర్శనాత్మకంగా అర్థం చేసుకోవాలి.

### హిందుత్వం కూడా మార్పును స్వీకరించాలి

హిందుత్వాన్ని భారతీయ సంస్కృతికి ప్రతీకగా భావించే వర్గాలు కూడా ఒక విషయాన్ని గుర్తించాలి. భారతదేశం గతంలో ఎప్పుడూ ఒకే రూపంలో లేదు. అది అనేక సంస్కృతులు, భాషలు, ఆచారాలు, తత్వాలు, మతాలు, సామాజిక ఉద్యమాలతో పరిణామం చెందింది.

అందువల్ల ఆధునిక హిందుత్వం యువతరాన్ని నియంత్రించడంలో కాకుండా, వారితో సంభాషించడంలో తన శక్తిని చూపాలి.

మహిళకు సమానత్వం ఇవ్వగల హిందుత్వం, దళిత గౌరవాన్ని అంగీకరించే హిందుత్వం, మైనారిటీ భద్రతకు హామీ ఇచ్చే హిందుత్వం, రాజ్యాంగ విలువలను గౌరవించే హిందుత్వం---అదే విస్తృత ప్రజాస్వామ్య సమాజంలో ఆమోదాన్ని పొందగలదు.

### యువతరం కూడా సంప్రదాయాన్ని అర్థం చేసుకోవాలి

అదే సమయంలో ఆధునిక యువతరం కూడా సంప్రదాయాన్ని మొత్తం తిరస్కరించాల్సిన అవసరం లేదు.

కుటుంబ అనుబంధం, పరస్పర సహకారం, పెద్దలను గౌరవించడం, సమాజం పట్ల బాధ్యత, ప్రకృతితో అనుబంధం, ఆధ్యాత్మిక అన్వేషణ వంటి విలువలు పాశ్చాత్య ప్రపంచానికే పరిమితమైనవి కావు.

కాబట్టి యువతరం చేయాల్సింది "పాతదంతా తప్పు, కొత్తదంతా సరైనది" అనే దృక్పథాన్ని విడిచిపెట్టడం.

అదే విధంగా పాత తరం కూడా "మా కాలంలో ఇలా ఉండేది కాబట్టి ఇప్పుడు కూడా అలాగే ఉండాలి" అనే పట్టుదలను విడిచిపెట్టాలి.

అవకాశాలు ఎక్కడున్నాయి?

ఈ విభేదంలోనే ఒక గొప్ప అవకాశం ఉంది.

హిందుత్వం భారతీయ సాంస్కృతిక గుర్తింపును బలపరచగలదు.

ఆధునికత వ్యక్తిగత స్వేచ్ఛను విస్తరించగలదు.

దళిత ఉద్యమం సామాజిక న్యాయాన్ని గుర్తుచేయగలదు.

మైనారిటీ స్వరాలు బహుళత్వాన్ని బలోపేతం చేయగలవు.

మహిళా ఉద్యమం సమానత్వాన్ని ముందుకు తీసుకెళ్లగలదు.

ఈ స్వరాలన్నీ పరస్పర శత్రువులుగా కాకుండా ప్రజాస్వామ్య సంభాషణలో భాగస్వాములుగా మారితే భారతదేశం మరింత పరిపక్వమైన సమాజంగా ఎదగగలదు.

### అసలు సవాలు: ఏకత్వమా? ఏకరూపతా?

భారతదేశానికి ఏకత్వం అవసరం. కానీ ఏకత్వం అంటే ఏకరూపత కాదు. 'భిన్నత్వంలో ఏకత్వం' అనే భావనను భారత దేశం దిగ్విజయంగా చూపిస్తూనే ఉంది. అదెలా అంటే ఏకత్వానికి:

ఒకే భాష అవసరం లేదు.

ఒకే రకమైన దుస్తులు అవసరం లేదు.

ఒకే మతాచారం అవసరం లేదు.

ఒకే జీవనశైలి అవసరం లేదు.

అవసరమైనది రాజ్యాంగ విలువలపై ఏకాభిప్రాయం.

స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, సౌభ్రాతృత్వం---ఇవి భారతీయ ప్రజాస్వామ్యానికి ఉమ్మడి పునాదులుగా నిలవాలి.

### ముగింపు

హిందుత్వ స్వప్నం ఒక సాంస్కృతిక ఆకాంక్షగా ఉండవచ్చు. ఆధునిక యువతరం స్వేచ్ఛ ఒక సామాజిక వాస్తవంగా ఎదిగి ఉండవచ్చు. దళితులు సామాజిక న్యాయాన్ని కోరవచ్చు. మైనారిటీలు తమ గుర్తింపు, భద్రత, సమాన పౌరసత్వాన్ని కోరవచ్చు. మహిళలు తమ జీవితంపై సంపూర్ణ నిర్ణయాధికారాన్ని కోరవచ్చు.

ఈ ఆకాంక్షలన్నింటినీ ఒకదానికొకటి విరుద్ధంగా నిలబెట్టాల్సిన అవసరం లేదు. ఎందుకంటే:

హిందుత్వం ఉంటే స్వేచ్ఛ ఉండకూడదని కాదు.

స్వేచ్ఛ ఉంటే సంప్రదాయం ఉండకూడదని కాదు.

భారతీయత ఉంటే వైవిధ్యం ఉండకూడదని కాదు.


భారతదేశ భవిష్యత్తు ఒక వర్గం గెలిచి మరొక వర్గం ఓడిపోవడంలో లేదు. విభిన్న ఆకాంక్షల మధ్య న్యాయమైన సమతుల్యత సాధించడంలో ఉంది. భారత దేశం దానిని సాధించగలడు కూడా ఎలా అంటే:

సంప్రదాయం మనకు మూలాలను ఇవ్వగలదు.

ఆధునికత మనకు రెక్కలను ఇవ్వగలదు.

రాజ్యాంగం మన ప్రయాణానికి దిశను ఇవ్వగలదు.

మూలాలు బలంగా ఉండాలి.. రెక్కలు స్వేచ్ఛగా ఉండాలి. అదే భారతదేశానికి ముందున్న అసలు అవకాశం; అదే దాని అతిపెద్ద సవాలు.



ప్రొఫెసర్. విశ్వేశ్వర రావు చెనమల్లు

# విశాఖలో ముగిసిన విద్యాభారతి అఖిలభారత సెకండరీ స్థాయి కార్యశాల

**విశాఖపట్నం, ఆగష్టు 25, జయ జయహే**

విద్యాభారతి - అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన సెకండరీ స్థాయి విద్యాపరిషత్ అఖిల భారత కార్యశాల మంగళవారం విజయవంతంగా ముగిసింది. ఆగస్టు 23, 24, 25 తేదీలలో నగరంలోని విశాలాక్షీనగర్ బీవీకే కళాశాలలో ఈ కార్యశాల జరిగింది. ఈ కార్యశాలలో దేశవ్యాప్తంగా 55 మంది ప్రాంత, క్షేత్ర ప్రముఖులు పాల్గొన్నారు. విద్యాభారతి అఖిలభారత సంఘటనా కార్యదర్శి గోవింద్ చంద్ర మహంత, ప్రధాన కార్యదర్శి దేశ్ రాజ్ శర్మ, సహ సంఘటనా కార్యదర్శి శ్రీరామ్ ఆరావ్ కార్ పాల్గొని సెకండరీ ఇంచార్జ్ లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎనఈపీ అమలు, కౌశల్ వికాస్ తరగతుల ప్రారంభం, ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య, విద్యారంగ సవాళ్లు-పరిష్కారాలు, విద్యార్థులలో కమ్యూనికేటివ్ స్కిల్స్ అభివృద్ధి వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.



ఈ కార్యశాల సెకండరీ స్థాయి అఖిలభారత ప్రముఖ్ రాజీవ్ గుప్తా ఆధ్వర్యంలో జరిగింది. ప్రారంభ కార్యక్రమంలో దక్షిణ మధ్య క్షేత్ర ఉపాధ్యక్షులు ఆచార్య గొల్లపల్లి నాగేశ్వరరావు, ముగింపు కార్యక్రమంలో ఏపీ సంఘటనా కార్యదర్శి కన్నా భాస్కర్, ప్రాంత కార్యకారిణి సభ్యురాలు బి. ధరణిప్రియ పాల్గొన్నారు.



## ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

**అచ్యుతాపురం, ఆగస్టు 25, జయ జయహే:**

ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్యకు దారితీసిన ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యుడైన సాధిక్ ఖాన్‌ను కఠినంగా శిక్షించాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తుందని భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజాన సన్యాసినాయుడు తెలిపారు. బిజెపి మండల అధ్యక్షుడు కూండ్రపు నాయుడు బాబు ఆధ్వర్యంలో ఈ ఘటనపై విచారణ జరపాలని కోరుతూ అచ్యుతాపురం ఎస్సై వెంకట్రావుకి వినతి పత్రాన్ని సోమవారం బీజేపీ శ్రేణులు అందించారు. బీజేపీ నేతల ఆరోపణల ప్రకారం, పరిచయం, నమ్మకం, ఆర్థిక లావాదేవీలు, బెదిరింపుల ద్వారా నూకరాజు కుటుంబాన్ని వేధించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని వినతి పత్రంలో కోరారు. ఈ కేసులో బాధిత కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు సాధిక్ ఖాన్‌కు సహకరించిన వారిపై కూడా చర్యలు తీసుకోవాలని బీజేపీ డిమాండ్ చేస్తుందన్నారు. రాష్ట్ర డీజీపీ, హోంమంత్రి ఈ ఘటనపై స్పందించి, రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. అయితే 'లవ్ జిహాద్'కు సంబంధించిన బీజేపీ ఆరోపణలు దర్యాప్తులో నిర్ధారణ కావాల్సి ఉందని, పోలీసులు కేసును అన్ని కోణాల్లో నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని పార్టీ పేర్కొందన్నారు. వినతి పత్రం అందించిన వారిలో రాజన్న సన్యాసినాయుడు తో పాటు మండల అధ్యక్షుడు కూండ్రపు నాయుడు బాబు, మామిడి సురేష్ కుమార్, పెంటకోట జయ అప్పారావు, తురాయి శ్రీరాములు, బండారు కన్నం నాయుడు కాసుబాబు తదితరులు పాల్గొన్నారు.



## సిఎం సహాయ నిధి ద్వారా రూ.33వేలు ఆర్థిక సహాయం

**చోడవరం, ఆగస్ట్ 25 జయ జయ హే**

చోడవరం నియోజకవర్గపరిధిలో గల రావికమతం మండలం కన్నంపేట గ్రామానికి చెందిన జనసేన పార్టీ సానుభూతిపరురాలు గల్లా లక్ష్మి ఇటీవల తీవ్ర అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించాలని ప్రతిపాదనలు సమర్పించగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూ.33,000 ఆర్థిక సహాయాన్ని మంజూరు చేశారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో గల్లా లక్ష్మి కుమారుడు గల్లా శ్రీనుకు మంగళవారం జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గ ఇంచార్జి పీవీఎస్ఎన్ రాజు కొత్తకోటలోని తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో రోలుగుంట మండల జనసేన పార్టీ అధ్యక్షులు బలిజి మహారాజ్, కూటమి నాయకులు డి.రాజేష్, జనసేన పార్టీ నాయకులు చింతల కిషోర్, లోట్ల శివ, భీమరాతి ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.



## కొళాయి పైపు మరమ్మతులు

**అరకులోయ: ఆగస్టు 25. జయ జయహే.**

చినలబుడు పంచాయితీ హట్టగూడ గ్రామంలో పది అడుగుల కొళాయి నీళ్లు పైపుని గుర్తుతెలియని వ్యక్తులు కట్ చేయడంతో హట్టగూడ గ్రామ ప్రజలు కొళాయి నీళ్లు రాకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఈ సమస్య తెలుసుకొని స్థానిక పంచాయతీ టిడిపి పార్టీ అధ్యక్షులు పాంగి భగత్ రామ్ స్థానిక పంచాయతీ అధికారులను మాట్లాడి పైపును తెప్పించి వేయించడం జరిగిందని ఆయన తెలిపారు. కొళాయి పైపు కనెక్షన్ రిపేరు చేయడంతో గ్రామంలోని వీధి వీధికి కొళాయి నీళ్లు రావడంతో గ్రామ ప్రజలు సంతోష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ కమిటీ తాంగుల డొంబురు. మజ్జి రామ్మూర్తి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## జాంబవ భవన నిర్మాణానికి 35000 విరాళం

**చోడవరం ఆగస్టు 25 జయ జయహే**

చోడవరం కోపరేటివ్ కాలనీలో జరిగిన మాదిగ ఉద్యోగ సమైక్య సమావేశంలో జాంబవ భవన నిర్మాణానికి అనకాపల్లి జిల్లా మాదిగ ఉద్యోగుల సమాఖ్యజిల్లా కమిటీ సభ్యులు, చోడవరం నియోజకవర్గం ఇంచార్జ్ పులగుజ్జుల రమణ మంగళవారం 35000 విరాళం అనకాపల్లి జిల్లా ఎం ఈ ఎఫ్ కార్యవర్గానికి అందించారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా మాదిగ ఉద్యోగుల సమాఖ్య తరఫున ఆయనను సాలువా తో సత్కరించారు. జాంబవ భవన నిర్మాణం కోసం ముందుకు రావడం చాలా సంతోషమని ప్రతి మాదిగ ఉద్యోగి ఆయనను ఆదర్శంగా తీసుకొని జాంబవ భవన నిర్మాణానికి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సమైక్య అనకాపల్లి జిల్లా మాజీ అధ్యక్షులు నీటి పల్లి ముత్యాలరావు, మాజీ అనకాపల్లి జిల్లా వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ కండెల్లి వెంకట్రావు మాజీ జిల్లా కోశాధికారి పెదమట్ల తాతాజీ, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోర్తా శ్రీనివాసరావు మాజీ జిల్లా ఉపాధ్యక్షులు కొత్తల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు



## వినాయక గుడిలో భక్తులకు చీరలు పంపిణీ

**మునగపాక ఆగస్టు 25 జయ జయహే**

మునగపాక, మండల కేంద్రం మునగపాక పల్లపు వీధిలో గల వినాయక ఆలయంలో నిత్య భజనలు చేస్తున్న సుమారు 25 మంది భక్తులకు సేవా కార్యకర్త ఆడారి కాశి బాబు మంగళవారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనలు పెంచుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు ఆధ్యాత్మికతను ప్రోత్సహించడం కోసమే తాను నిత్య భజన చేస్తున్న మహిళలకు చీరలు పంపిణీ చేయడం జరిగిందని కాశి బాబు తెలిపారు

## మిలాద్ ఉన్ నబి వేడుకలకు పటిష్ట భద్రత:

**ఎస్పీ నరసింహ కిషోర్**

**రాజమహేంద్రవరం: జయ జయహే**



ఆగస్టు 25 :మిలాద్ ఉన్ నబి పర్వదినాన్ని పురస్కరించుకుని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్, ఐపీఎస్. ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, "మిలాద్ ఉన్ నబి పవిత్ర పర్వదినాన్ని జిల్లాలోని ముస్లిం సోదర సోదరీమణులు ఆనందోత్సాహాలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జిల్లా పోలీసు యంత్రాంగం విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. మసీదులు, దర్గాలు, ప్రార్థనా స్థలాల వద్ద ప్రత్యేక బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు అమలు చేస్తాం. ప్రజలందరూ పరస్పర సామరస్యాన్ని కాపాడుతూ పోలీసులకు సహకరించి పండుగను శాంతియుతంగా నిర్వహించుకోవాలి" అని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో పండుగ వేడుకలు ప్రశాంతంగా జరిగేలా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.



## ఘనంగా బిపి మండల్ యాదవ్ 109వ జయంతి

**అనకాపల్లి (జయ జయహే)**

సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ళ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో బి.పి. మండల్ యాదవ్ 109,వ జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు, ఈ సందర్భంగా ఆళ్ళ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ బీహార్ మాజీ ముఖ్యమంత్రి, బీసీల సామాజిక న్యాయానికి దిక్సూచి బి.పి. మండల్ యాదవ్ .వెనుకబడిన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం, సమాన అవకాశాల కోసం ఆయన చేసిన కృషి చారిత్రాత్మకం. బీసీలకు రిజర్వేషన్ల ద్వారా విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో అవకాశాలు కల్పించేందుకు మార్గదర్శకమైన మండల్ కమిషన్ ఆయన పేరుతోనే చరిత్రలో నిలిచిపోయింది. బీసీల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం తరతరాలకు స్ఫూర్తి. సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన బాట మనందరికీ ఆదర్శం అని అన్నారు ఈ కార్యక్రమంలో సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్దం పైడిరాజు, మాజీ ప్రధాన కార్యదర్శి బి.సి నాయకులు బొట్టా చిన్ని యాదవ్, అనకాపల్లి యువజన సంఘం జిల్లా అధ్యక్షులు చిన్న మూర్తి, యువజన విభాగం బి.సి నేతలు, కృష్ణ, మరియు రాష్ట్ర బి.సి నాయకులు జిల్లా బీసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు బీవీకేలో సంస్కృత భాషా దినోత్సవం

**విశాఖపట్నం, ఆగష్టు 25, జయ జయహే**

అన్ని బాషలకు మలమైన సంస్కృతాన్ని అందరికీ చేరువ చేయాలనే లక్ష్యంతో ఏటా శ్రావణ పౌర్ణమి రోజున హయగ్రీవ జయంతి పేరిట సంస్కృత దినోత్సవాన్ని బుధవారం ద్వారకానగర్ బీవీకే కాలేజీలో నిర్వహిస్తున్నామని విశాఖ సంస్కృత సప్తాహ సమన్వయకర్తలు పిళ్లా వెంకట రమణ మర్తి, పేరాల హరిప్రియ వరలక్ష్మి, వేదుల రామకృష్ణ శర్మ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం బీవీకే కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీవీకే కరెస్పాండెంట్ ఆచార్య విశ్వనాథ్, ప్రిన్సిపల్ రత్నశేఖర్, శ్రీ విశ్వనాధ సాహిత్య పీఠం కార్యదర్శి పేరాల సీతారామ ప్రభుతో కలసి వారు మాట్లాడారు. ఈ భాష అమ్మవంటిదని అందుకే దీన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుందన్నారు. ఏపీ తెలుగు, సంస్కృత అకాడెమీ, న్యూ ఢిల్లీకి చెందిన కేంద్రీయ సంస్కృత విశ్వ విద్యాలయం సంయుక్తంగా బీవీకే కాలేజీ




కేంద్రంగా నిర్వహిస్తున్న ఈ భాషా దినోత్సవంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ముఖ్య అతిధిగా, సంస్కృత అకాడెమీ ఛైర్మన్ ఆర్డీ విల్సన్ శరత్ చంద్ర, సభాధ్యక్షులుగా ఏయు విశ్రాంత ఉప కులపతి జి. నాగేశ్వరరావు, తదితరులు హాజరుకానున్నారని వెల్లడించారు. బుధవారం ఉదయం 10 గంటలకు బీవీకే సమావేశ మందిరంలో జరిగే ఈ కార్యక్రమంలో సంస్కృత వ్యాప్తికి కృషి చేసిన పలువురు ఆచార్యులను సన్మానిస్తామని వెల్లడించారు.


# అక్రమ కట్టడాలపై చర్యలు ఏవి?

**డుంబ్రిగూడ: ఆగస్టు 25. జయ జయహే.**

అరకు పంచాయతీ కేంద్రానికి కూతవేటు దూరంలో నేషనల్ హైవే రోడ్డుకు ఇరువైపులా గిరిజనేతరులు, బినామీ దారులు అక్రమ కట్టడాలు నిర్మాణం చేసుకుంటున్నారనీ, 1/70చట్టాన్ని పూర్తిగా విస్మరించి ప్రభుత్వ భూములు, గ్రామ కంఠం భూములు ఆక్రమణలు చేసుకొని దర్జాగా షాపింగ్ కాంప్లెక్స్ లు నిర్మాణం చేసుకుంటున్నారనీ తెలిపారు. తూతూ మంత్రంగా పంచాయతీ, రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారనీ విమర్శించారు. నేరేడు వలస ప్రభుత్వ పాఠశాలకు సంబందించిన స్థలం కబ్జా చేసి గిరిజనేతరుడు అయినా ఏరుబంటి. శ్రీను, కోరుకొండ. రమేష్ ఇద్దరు కలిసి బినామీ పేర్లతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేసుకుంటున్న కూడా ఎటువంటి చర్యలు తీసుకో కుండా అధికారులు నిద్ర పోతున్నారనీ మండిపడ్డారు. కొయ్యల. నంధీశ్వరరావు వెల్డింగ్ షాపు యజమాని ఇప్పటికే అనేక భవనాలు నిర్మాణం చేసుకున్నారనీ, అతని పై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదనీ చెప్పారు. తలారి. అప్పలనాయుడు అనేగిరిజనేతరుడు నేషనల్ హైవే, హనుమాన్ జంక్షన్ దగ్గర పెద్ద రెస్టారెంట్ నిర్మాణం చేసుకున్నారనీ, సాక్షాత్తు జాయింట్ కలెక్టర్ తిరుమణీ శ్రీపూజ ఎంక్వరీ చేసిన ఎటువంటి చర్యలు లేదని తెలిపారు.అరకు పంచాయితీలో పూర్తిగా 1/70చట్టం దురాక్రమణ జరుగుతుందనీ, జిల్లా కలెక్టర్, ఐటిడిఏ, పీఓ,



జాయింట్ కలెక్టర్ వెంటనే స్పందించి గిరిజనేతరులు నిర్మాణం చేస్తున్న భవనాలు, షాపింగ్ కాంప్లెక్స్ లు కూల్చలన్నారు. వారిపై ఎల్టీఆర్ కేసులు నమోదు చేయాలనీ డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా ఉన్న పంచాయతీ సెక్రటరీ, వీఆర్వో లపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. లేకపోతే ప్రజా ఆగ్రహానికీ




ప్రభుత్వ అధికారులు భాధ్యత వహించవలసిన అవసరం ఉంటుందని చెప్పారు. 1/70చట్టం పటిష్టంగా అమలు చేయాలనీ పెద్ద ఎత్తున ఆదివాసీ ప్రజాసంఘాలు, ఆదివాసులు పోరాడుతుంటే, కూటమి ప్రభుత్వం కనీసం వాటి అమలు కోసం చర్యలు తీసుకోపోవడం శోచనీయం అన్నారు.



## అగనంపూడి ప్రజా సమస్యలపై
# జీవీఎంసీకి బలిరెడ్డి వినతి

**అగనంపూడి, ఆగష్టు 25, జయ జయహే :**

జీవీఎంసీ అదనపు కమిషనర్ డివి రమణమూర్తిని ఎడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ కలిసి జీవీఎంసీ 79, 85 వార్డులకు సంబంధించి పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆయా వార్డులకు అనుబంధంగా ఉన్న జాతీయ రహదారి ఇరుపక్కల జన సంచారం అధికంగా ఉంటుందని కానీ అక్కడ ప్రజా మరుగుదొడ్లు లేకపోవడం వల్ల మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆయా సెంటర్లలో ఉన్న షాపుల్లో పనిచేసే వారికి, బ్యాంకు, నెట్ షాపులకు వచ్చేవారికి, వినియోగదారులు, ప్రయాణికులకు, ఏరియా ఆసుపత్రి పేషెంట్స్ సహాయకులకు సౌకర్యంగా అగనంపూడి సెంటర్లో ఉన్న పాత పంచాయత్ ఆఫీస్ వద్ద ప్రజా మరుగుదొడ్డు నిర్మాణం చేయాలని సూచించారు. అగనంపూడి నిర్వాసిత కాలనీ ప్రజలకు మానసిక వికాసానికి విజ్ఞానానికి దోహదపడే విధంగా అగనంపూడి జాతీయ రహదారి ప్రక్కన ఉన్న ఎన్టీఆర్ పార్కు డిజిటల్ లైబ్రరీగా ఉపయోగించాలని, లంకెలపాలెం నుండి కూర్మన్నపాలెం వరకు జాతీయ రహదారికి ఇరు ప్రక్కల సర్వీసు రోడ్లు తక్షణమే వేసి రోడ్డు ప్రమాదాలు నివారించాలని, 84 వ వార్డు ఏలేరు కాలువ లోనికి కొప్పాక పరిసర ప్రాంతాల మురికి నీరు వెళ్లి త్రాగే మంచి నీరు కలుషితం అవుతోందని, అలా కాకుండా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆ వినతి పత్రములో పేర్కొన్నారు.




# వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి అవార్డుల ప్రధానం

**విశాఖపట్నం. ఆగస్టు 25, జయ జయహే**

చేయూత సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అమెరికాకు చెందిన డేస్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ (ఇండియా) గౌరవ డాక్టరేట్లు ,,సేవారత్న పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం మంగళవారం పబ్లిక్ లైబ్రరీలో జరిగింది. సమాజంలో పలు రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న సేవా తత్పరులకు, సామాజిక కార్యకర్తలకు ఈ సందర్భంగా సామాజిక సేవా పురస్కారాలను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు అడ్వకేట్ కె. అరుణ్ కుమార్, డేస్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, నేషనల్ డైరెక్టర్ డాక్టర్ ఏమోస్ జేమ్స్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ వై.ఎస్. చిన్నారావు తదితరులు హాజరై వివిధ రంగాల్లో సేవలు అందించిన 6గురికి గౌరవ డాక్టరేట్లుప్రధానం చేయగా, 5గురుకు సేవా రత్న పురస్కారాలు అందించారు. అలాగే ముగ్గురుకి బ్యాచ్యురల్ ఆఫ్ థియాలజీ( బి.టి హెచ్) సర్టిఫికెట్లను అందజేశారు. సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమిస్తూ, గిరిజన గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య రంగంలో సేవలు అందించిన దూబ రాంబాబుకు గౌరవ డాక్టర్ ప్రధానం చేశారు. వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న వ్యక్తులు మరియు సంస్థల సేవలను నిర్వాహకులు ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, పెద్దలు పాల్గొన్నారు.



## ఇస్కాన్‌లో 9 రోజులపాటు
# శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాలు

**రాజమహేంద్రవరం: జయ జయహే: ఆగస్టు 25:**

గౌతమీ ఘాట్‌లోని ఇస్కాన్ మందిరంలో ఈ ఏడాది శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాలు ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 5 వరకు తొమ్మిది రోజులపాటు వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రవీంద్ర చైతన్య దాస్, హేమ నిమాయి దాస్, శ్రీహరి కరుణ దాస్ తెలిపారు. ప్రతిరోజూ మంగళహారతి, దర్శన హారతి, గురుపూజ, శ్రీమద్భాగవత ప్రవచనం, యజ్ఞసేవ, శ్రీకృష్ణ లీలలపై ప్రవచనం, దివ్య వాహన సేవ, ఊయల సేవ, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 3న విద్యార్థులు, యువతకు నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేయనుండగా, మందిరం మేనేజ్‌మెంట్ ఛైర్మన్ హెచ్.జి . సత్య గోపీనాథ్ దాస్తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారు. సెప్టెంబర్ 4న శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా మహాభిషేకం, విశ్వశాంతి యజ్ఞం, అవభృథ స్నానం, ఉట్టి ఉత్సవం, రాత్రి మహా కుంభాభిషేకం, మహామంగళ హారతి నిర్వహిస్తారు. సెప్టెంబర్ 5న ఇస్కాన్ వ్యవస్థాపకాచార్యులు శ్రీల ప్రభుపాదుల ఆవిర్భావోత్సవం (వ్యాసపూజ) సందర్భంగా మహాభిషేకం, గురుపూజ, అన్నప్రసాద వితరణ ఉంటుంది. రాజమండ్రి, పరిసర ప్రాంతాల భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొనాలని నిర్వాహకులు ఆహ్వానించారు.




# బైక్‌పై ఎమ్మెల్యే సుందరపు పర్యటన

## థాంక్యూ ఎమ్మెల్యే అంటూ నినాదాలు

**అచ్యుతాపురం, ఆగష్టు 25, జయ జయహే:**

ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఎలమంచిలి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులను సమీక్షించేందుకు ప్రజల కష్టసుఖాలు తెలుసుకున్నందుకు ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మంగళవారం బైక్ పై పర్యటించారు. ఈ సందర్భంగా ఎలమంచిలి మున్సిపాలిటీలో ఆయనకి పలుచోట్ల ఘన స్వాగతం పలికారు. నియోజకవర్గంలోని ఎలమంచిలి మున్సిపాలిటీలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు, అభివృద్ధి పనులును స్వయంగా వీక్షించేందుకు ఎమ్మెల్యే స్వయంగా బైకుపై మంగళవారం పర్యటించిన పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే 7.5 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు మున్సిపాలిటీలో జరుగుతున్నాయని, మరో 24 కోట్ల రూపాయలు ప్రతిపాదనలు ఉన్నాయని, త్వరలోనే మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ నిధులు మంజూరు చేస్తారని, దీంతో ఎలమంచిలి మున్సిపాలిటీలో మరింత అభివృద్ధి పనులు చేయడం జరుగుతుంది అని విజయ్ కుమార్ చెప్పారు. ఎమ్మెల్యే స్వయంగా ప్రజల మధ్య పర్యటించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## గురుద్వారాలో
# నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**విశాఖపట్నం, ఆగష్టు 25, జయ జయహే**

గురుద్వారా పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను బుధవారం నిలిపివేస్తున్నామని ఆపరేషన్ జోన్ 1 కార్యనిర్వాహక ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 09:30 గంటల నుండి మధ్యాహ్నం 14:30 గంటల వరకు 11 కేవీ గురుద్వారా ఫీడర్ మెయింటెన్స్ పనులు చేపట్టనున్నట్టు వెల్లడించారు. ఈ కారణంగా గురుద్వారా, సీతమ్మధార, బీఎస్ లే అవుట్, నవోదయ స్కూల్, పోలీస్ స్టేషన్ రోడ్ వంటి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేయనున్నట్టు ప్రకటించారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.




## సబ్ స్టేషన్‌ను సందర్శించిన
# కొయ్యూరు విద్యార్థులు

## విద్యుత్ సరఫరా, పంపిణీ విధానంపై ఇంజనీర్లు అవగాహన..

**కొయ్యురు : (జయ జయహే ) న్యూస్ ఆగష్టు 26,**

కొయ్యూరు జిటీడబ్ల్యూ ఏ స్కూల్ బి కొయ్యూరు-1 పాఠశాలలో 9వ, 10వ తరగతులు చదువుతున్న విద్యార్థులకు వొకేషనల్ ఎడ్యుకేషన్ లో భాగంగా ఇండస్ట్రియల్ విజిట్ నిర్వహించారు. ఎలక్ట్రానిక్స్ వొకేషనల్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులను రాజవొమ్మంగి 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా విద్యార్థులు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు, సర్క్యూట్ బ్రేకర్లు, కంట్రోల్ ప్యానల్స్ తదితర పరికరాలను పరిశీలించారు. విద్యుత్ సరఫరా, విద్యుత్ పంపిణీ విధానం, సబ్ స్టేషన్ లోని (కొంగర అబ్బాయిదొర) మరియు జూనియర్ ఇంజనీర్ విద్యార్థులకు విపులంగా అవగాహన కల్పించారు. ప్రత్యక్షంగా సబ్ స్టేషన్ ను సందర్శించి పరికరాల పనితీరును పరిశీలించడం ద్వారా విద్యార్థులకు పాఠ్యాంశాలపై మరింత అవగాహన ఏర్పడిందని వొకేషనల్ ఉపాధ్యాయుడు బొడ్డు సిసింద్రీ నాయుడు తెలిపారు. ఈ ఇండస్ట్రియల్ విజిట్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు , వొకేషనల్ ఉపాధ్యాయుడు బొడ్డు సిసింద్రీ నాయుడు మరియు ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొని విద్యార్థులకు సహకరించారు.



# బాలల భద్రతపై అవగాహన..

## కొయ్యూరు సీఐ బి. శ్రీనివాసరావు..

**కొయ్యురు : (జయ జయహే ) న్యూస్ ఆగష్టు 26,**

కొయ్యూరు సీఏహెచ్ హెచ్ పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో కొయ్యూరు సీఐ బి. శ్రీనివాసరావు పాల్గొని బాలల భద్రత, మహిళా రక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అంగన్‌వాడీలు గ్రామ స్థాయిలో చిన్నారులు, బాలికలు, మహిళలతో నిరంతరం దగ్గర గా ఉంటారని, వారి భద్రత విషయంలో సమస్యలను ముందుగానే గుర్తించడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. 18 ఏళ్ల లోపు బాలికలకు వివాహం చేయడం నేరమని, పిల్లలపై శారీరక, మానసిక వేధింపులు జరిగితే నిర్లక్ష్యం చేయవద్దని, వారి ప్రవర్తనలో మార్పులు గమనిస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. పిల్లలు మొబైల్ వాడకాన్ని తల్లిదండ్రులు పర్యవేక్షించాలని, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. వేధింపులకు గురైన మహిళలు భయపడకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ వాడకంపై అవగాహన కల్పించాలన్నారు. పిల్లలు, మహిళల భద్రత కోసం పోలీస్ శాఖ, అంగన్‌వాడీ శాఖ, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ప్రాజెక్టు అధికారి కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

## కొయ్యూరులో వైస్సార్సీపీ
# విస్తృత స్థాయి సమావేశం

## ఎంపీపీ బడుగు రమేష్ పిలుపు...

**కొయ్యురు : (జయ జయహే ) న్యూస్ ఆగష్టు 26,**



అల్లూరి జిల్లా కొయ్యూరు మండల కేంద్రంలో బుధవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరగనుందని ఎంపీపీ బడుగు రమేష్ గారు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి పాడేరు నియోజకవర్గ ఎమ్మెల్యే, జిల్లా ఇంచార్జ్ శ్రీ మత్స్యరాస విశ్వేశ్వరరాజు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ రమేష్ మాట్లాడుతూ స్థానిక సంస్థల బలోపేతం, పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై చర్చించడమే ఈ సమావేశ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా ఎన్నికల హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తోందని, జగనన్న హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకే పేర్లు మార్చి అమలు చేస్తూ గొప్పలు చెప్పుకుంటోందని విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గతంలో మాదిరిగానే కొయ్యూరు మండలంలోని ప్రతి పంచాయతీలో వైఎస్సార్సీపీ జెండా ఎగరవేసే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని, ప్రతి గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి మండల పార్టీ అధ్యక్షులు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, రాష్ట్ర, జిల్లా, మండల అనుబంధ విభాగాల సభ్యులు, మహిళా విభాగం, సర్పంచుల ఫోరమ్ మాజీ అధ్యక్షులు, మాజీ సర్పంచులు, వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మాజీ వాలంటీర్లు, గృహ సారథులు అందరూ అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యం





**మొదటి పేజీ తరువాయి...**

మండలం నల్లంపల్లిలో నిర్వహించిన నియోజకవర్గం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'విజయనగరం రాజుల మూడో రాజధాని రాయదుర్గం. ఈ రాయదుర్గం కోటలో ఎంత పౌరుషం ఉందో.. ఇక్కడి ప్రజల్లోనూ అంతే పౌరుషం ఉంది. ఇక్కడ పట్టు చీరలు, జీన్స్ ఎంత ఫేమసో.. మీ ప్రేమ, అభిమానం, స్టైల్ కూడా అంతే ఫేమస్. అవన్నీ ఈరోజు ప్రత్యక్షంగా చూశాను. గత 11 ఎన్నికల్లో టీడీపీ కేవలం 4 సార్లు మాత్రమే గెలిచినా.. గెలిచినా, ఓడినా రాయదుర్గం నియోజకవర్గాన్ని గుండెల్లో పెట్టుకుని అభివృద్ధి చేసిన వ్యక్తి చంద్రబాబు నాయుడు. ఓబుళాపురం గనుల పేరుతో అడ్డగోలుగా అక్రమ మైనింగ్ జరుగుతున్నప్పుడు కమిటీ వేసి ప్రజల తరపున పోరాడింది టీడీపీ. నాడు మనం చేసిన పోరాటానికి ఫలితంగా తాజాగా తీర్పు వచ్చింది'.

'ప్రజల కోసం పోరాడింది.. ప్రజల తరపున నిలబడింది తెలుగుదేశం పార్టీనే. మీ అందరి కష్టం, శ్రమతో 2024లో కాలవ శ్రీనివాసులును 43 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించుకున్నాం. పట్టుదల, క్రమశిక్షణతో నియోజకవర్గానికి నాయకత్వం వహిస్తున్న కాలవ శ్రీనివాసులు.. ఎప్పుడూ నియోజకవర్గ అభివృద్ధి గురించే మాట్లాడుతుంటారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఎల్ నినో ప్రభావం ఉంది. ప్రజలకు తాగునీరు, పంటలకు సాగునీటి సమస్య రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది'. 'రాయదుర్గం ప్రాంతంపై కూడా ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ.. ప్రజలకు నీటి ఇబ్బందులు రాకుండా కాలవ శ్రీనివాసులు నిరంతరం కృషి చేస్తున్నారు. అసెంబ్లీలో నియోజకవర్గ అభివృద్ధితో పాటు రాష్ట్రానికి అవసరమైన అంశాలపై కూడా మాకు విలువైన సలహాలు, సూచనలు ఇస్తున్నారు' అని నారా లోకేష్ తెలిపారు.

### కార్యకర్తలే పార్టీకి బలం

'ఈ రోజు మేము మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా వేదికపై కూర్చున్నామంటే దానికి ప్రధాన కారణం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలే. అహర్నిశలు పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలు ఎన్నో కేసులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా 2019 - 24 మధ్య దాడులు, దౌర్జన్యాలు, వేధింపులు ఎదురైనా ఎత్తిన పసుపు జెండాను దించకుండా పార్టీ కోసం పోరాడారు'.

'గొడ్డలి పార్టీ కుట్రలకు, అక్రమ కేసులకు భయపడకుండా నిలబడిన కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి అసలైన బలం. అందుకే తెలుగుదేశం పార్టీ కార్యకర్తే అధినేత. దేశంలో మరే రాజకీయ పార్టీ కల్పించని విధంగా కార్యకర్తలకు బీమా సౌకర్యం కల్పిస్తున్న పార్టీ టీడీపీ. కార్యకర్తల సంక్షేమం కోసం ఇప్పటికే రూ.160 కోట్లు ఖర్చు చేశాం. కష్టపడి పనిచేస్తున్న నిజమైన కార్యకర్తలకు గుర్తింపు, గౌరవం కల్పించడమే మా లక్ష్యం' అని నారా లోకేష్ చెప్పారు.

### మైటీడీపీ యాప్‌లో మీ ఫీడ్ బ్యాక్ ఇవ్వండి.. నేను పరిష్కరిస్తాను

'యువగళం పాదయాత్రలో కార్యకర్తలను కలిసినప్పుడు.. 'పార్టీ కోసం పనిచేస్తున్న వారికి ప్రాధాన్యత ఇవ్వండి.. మమ్మల్ని గుర్తించండి' అని చాలామంది కోరారు. అందుకే మైటీడీపీ యాప్‌ను తీసుకొచ్చాం. మీరు పాల్గొనే ప్రతి పార్టీ కార్యక్రమం, మీరు సొంతంగా చేపట్టే ప్రతి కార్యక్రమం పార్టీకి తెలియాలంటే మైటీడీపీ యాప్‌లో ఫీడ్ చేయండి. క్లస్టర్, యూనిట్, బూత్ సమావేశాల్లో మీరు ఇచ్చే ఫీడ్‌బ్యాక్‌ను మేము చదువుతున్నాం. మీరు చెప్పే సమస్యలు, సూచనలు మాకు చేరడం లేదనే అపోహ వద్దు. కొత్త పెన్షన్లు, ఇళ్లు ఇవ్వాలని కార్యకర్తలే ఫీడ్‌బ్యాక్‌లో కోరారు'.

'కొత్త పెన్షన్‌లు ఇచ్చే బాధ్యత కూటమి ప్రభుత్వానిది. ఇలా మీరు ఇచ్చే ఫీడ్‌బ్యాక్ ఆధారంగానే నేను నిర్ణయాలు తీసుకుంటాను. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు కచ్చితంగా గుర్తింపు దక్కుతుంది. మీరు మమ్మల్ని వెతుక్కుంటూ రావాల్సిన అవసరం లేదు.. మేమే మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తాం'. 'కోటి మంది సభ్యులతో కూడిన కుటుంబం మనది. సముద్రం లాంటి ఈ కుటుంబంలో సమస్యలు సహజం. మనలో మనమే చర్చించుకుని సమస్యలను పరిష్కరించుకోవాలి. ఎక్కడైనా మీ సమస్య పరిష్కారం కాకపోతే మా దగ్గరకు రండి. మీకు అండగా నేను ఉంటాను. కార్యకర్తల కోసం, పార్టీ కోసం ఎప్పుడూ ముందుండి పనిచేస్తాం' అని కార్యకర్తలకు నారా లోకేష్ హామీ ఇచ్చారు.

### టీడీపీలో కార్యకర్తే అధినేత

ముఖ్యమంత్రి చంద్రబాబు ఏ నియోజకవర్గానికి వెళ్లినా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అనంతరం కార్యకర్తలను కలవడానికే ప్రాధాన్యత ఇస్తారు. ప్రతి కార్యకర్తతో మాట్లాడి, ఫొటో దిగి, వారి సమస్యలను తెలుసుకున్న తర్వాతే అమరావతికి తిరుగు ప్రయాణమవుతారు. కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ ఇచ్చే విలువకు ఇదే నిదర్శనం. 2025 మహానాడులో ప్రవేశపెట్టుకున్న ఆరు శాసనాల్లో 'కార్యకర్తే అధినేత' అనేది అత్యంత ముఖ్యమైనది. టీడీపీలో కార్యకర్తే అధినేత. అందుకే మహానాడు, అసెంబ్లీ, మండలి సహా పార్టీకి సంబంధించిన అన్ని కార్యక్రమాల్లో కార్యకర్తలు ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులతో కలిసి వేదికను పంచుకుంటున్నారు. 'కష్టపడి పనిచేసే కార్యకర్తకు గుర్తింపు, గౌరవం కల్పించడం టీడీపీ బాధ్యత. కార్యకర్తల సంక్షేమానికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుంది. పార్టీ కోసం ప్రాణాలు వదిలిన తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు చట్టాన్ని సవరించి బిల్లు తీసుకొచ్చాం. వైసీపీ ఎమ్మెల్సీలు అడ్డుకునేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా చివరకు బిల్లును చట్టంగా చేసి చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాం. నమ్ముకున్న సిద్ధాంతం కోసం ప్రాణాలు అర్పించిన కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ ఇచ్చిన గౌరవానికి ఇదే నిదర్శనం' అని లోకేష్ పేర్కొన్నారు.

### అనంత అభివృద్ధి నా బాధ్యత

'ఉమ్మడి అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీకి కంచుకోట. మా కుటుంబాన్ని ఆశీర్వదించి గెలిపించిన ప్రజలు అనంతపురం జిల్లా ప్రజలు. నాడు ఎన్టీఆర్‌ని గెలిపించి అసెంబ్లీకి పంపించిన గొప్ప నేల ఇది. మా హరిమామను శాసనసభకు, పార్లమెంట్‌కు, మా ముద్దుల మామ బాలకృష్ణను మూడు సార్లు అసెంబ్లీకి పంపించిన ఘనత అనంతపురం ప్రజలది. ఈ అభిమానాన్ని జీవితాంతం గుర్తుపెట్టుకుంటాం. అహర్నిశలు మీ కోసం కృషి చేస్తానని హామీ ఇస్తున్నాను. అందుకే అనంతపురం జిల్లాకు ప్రత్యేక సంస్థలు, పరిశ్రమలు తీసుకొచ్చి ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నాం'. 'ఇప్పటికే సోలార్, విండ్ ఎనర్జీ రంగాల్లో భారీ పెట్టుబడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. ప్రతిష్టాత్మకమైన ఫైటర్ జెట్ తయారీ సంస్థ కూడా అనంతపురం ప్రాంతానికి సొంతమైంది. ఏ రంగంలో అయినా ఆరోగ్యకరమైన పోటీతత్వం ఉంటేనే అభివృద్ధి వేగంగా జరుగుతుంది. అదే పోటీతత్వం ఎమ్మెల్యేల మధ్య కూడా ఉండాలి. ఉరవకొండలో తయారయ్యే విండ్‌మిల్‌పై "మేడ్ ఇన్ ఉరవకొండ" అని మంత్రి కేశవ్ పెట్టుకుంటున్నారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని మిగిలిన ఎమ్మెల్యేలు కూడా తమ నియోజకవర్గాలకు కంపెనీలు తీసుకురావాలి.. తమ నియోజకవర్గానికి పేరు రావాలని పోటీతత్వంతో పనిచేయాలి' అని లోకేష్ కోరారు.

### రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

'రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేక పోయినా ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ ముందుకు వెళ్తున్నాం. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అత్యధికంగా పెన్షన్లు అందిస్తున్నాం. దీపం 2.0 కింద ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, స్త్రీ శక్తి ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నాం. తల్లికి వందనం, చేనేతలకు ఉచిత విద్యుత్, చేనేత సేవ, మత్స్యకార సేవ, ఆటోవాలా సేవ వంటి కార్యక్రమాల ద్వారా అన్ని వర్గాల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ఆర్థిక సహాయం అందిస్తున్నాం'. 'పెన్షన్ల కోసం ఏటా రూ.35 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం డీఎస్సీ ఫైల్‌పైనే చేశారు. వెంటనే దాన్ని కార్యాచరణలోకి తీసుకొచ్చి 16 వేల టీచర్ పోస్టులను భర్తీ చేశాం. ఎన్ని కేసులు వేసి అడ్డుకోవాలని చూసినా నియామకాలు పూర్తి చేశాం. కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేశాం. 10 వేల పోస్టులతో జాబ్ క్యాలెండర్ ప్రకటించాం. పరిశ్రమలను ఆకర్షిస్తూ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం'. 'నేడు పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్.. దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉంది. ఈ అభివృద్ధికి బ్రాండ్ చంద్రబాబు. గొడ్డలి పార్టీలో గొడ్డలి బ్యాచ్, ఫ్యాక్షనిస్టులు, దొంగలు ఉంటారు కాబట్టే వారి ఆలోచనలు కూడా అలాగే ఉంటాయి. కానీ చంద్రబాబు ఆలోచన ఎప్పుడూ రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం చుట్టూనే ఉంటుంది. ఆ మార్పును మనమంతా ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాం' అని నారా లోకేష్ తెలిపారు.

### గొడ్డలి పార్టీవి అన్నీ డ్రామాలే

'నేడు మనం గొడ్డలి పార్టీతో రాజకీయంగా పోరాడుతున్నాం. వారిలో వారే హత్యలు చేసుకుని.. ఆ నిందను మనపై వేసే నైజం వారిది. సొంత బాబాయిని హత్య చేసిన ఘటనలో ప్రొడక్షన్, డైరెక్షన్, ఫైనాన్స్ మొత్తం వాళ్లదే. 2019లో గొడ్డలి పార్టీకి చెందిన దొంగ పత్రికలో "నారాసుర రక్త చరిత్ర" అంటూ ఫొటో ప్రచురించి చంద్రబాబుపై నిందలు వేశారు. ఆ ప్రచారాన్ని చూసి బాబాయి కుటుంబ సభ్యులతో పాటు ప్రజలు కూడా నమ్మారు. కానీ ఇప్పుడు ఒక్కొక్కటిగా వాస్తవాలు బయటకు వస్తున్నాయి'. 'తాజాగా వారి ఎంపీ ఇంట్లోనే నోట్ల కట్టలు బయటపడటం దీనికి మరో ఉదాహరణ. కోడి కత్తి డ్రామా.. గులకరాయి డ్రామా. గులకరాయి వ్యవహారమైతే మరో హైలైట్. టెన్నిస్ బాల్ కంటే వేగంగా తిరిగిన ఆ రాయి.. జగన్‌కు తగిలి కింద పడాల్సింది పోయి పక్కనే ఉన్న ఓ నటుడికి తగిలిందట. మరీ విచిత్రంగా ఆ నటుడు ఒకరోజు ఒక వైపు, మరో రోజు మరో వైపు కట్టు కట్టుకుని కనిపించాడు. 2019-24 మధ్య గొడ్డలి పార్టీ హయాంలో కల్తీ మద్యం కారణంగా ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు'. 'అదే సమయంలో జరిగిన లిక్కర్ స్కామ్‌పై ప్రస్తుతం ఈడీ విచారణ కొనసాగుతోంది. పూర్తి ఆధారాలతో గొడ్డలి పార్టీ మాజీ మంత్రిని ఈడీ అరెస్ట్ చేస్తే.. దానిపై కూడా మనల్ని తప్పుబడుతున్నారు. ఈడీ కేంద్ర దర్యాప్తు సంస్థ.. మనం చెబితే అరెస్టు చేసే జేబు సంస్థ కాదు. గొడ్డలి పార్టీ నుంచి భవిష్యత్‌లో ఇంకా ఎన్ని డ్రామాలు చూడాల్సి వస్తుందో!' అని మంత్రి నారా లోకేష్ ఎద్దేవా చేశారు.

### పులివెందుల ప్రజల కోసమైనా జగన్ అసెంబ్లీకి రావాలి

'జగన్ ప్రెస్‌మీట్ పెడితే మనందరికీ పండగే. చంద్రబాబు ప్రెస్‌మీట్‌లో ఆయన చెప్పే విషయం ఏమీ తెలియని వారికి కూడా సులభంగా అర్థమయ్యేలా ఉంటుంది. కానీ మాజీ సీఎం జగన్‌కు డీఎస్సీ, ఏపీపీఎస్సీకి తేడా తెలియదు. డీఎస్సీ, ఏపీపీఎస్సీ రెండూ ఒకటేనంటారు. జగన్ రెడ్డికి మరోసారి సవాల్ చేస్తున్నా. టైమ్, డేట్, లొకేషన్ నువ్వే ఫిక్స్ చేయి.. డీఎస్సీపై చర్చకు నేను సిద్ధం. అసెంబ్లీలోనూ ఎన్ని రోజులైనా చర్చించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం'. 'నా సవాల్‌ను స్వీకరించి ఎందుకు రావడం లేదు? ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా ప్రకటించకుండా, ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదనే వాస్తవం బయటపడుతుందనే భయమా? ప్రెస్‌మీట్లు ఎందుకు.. అసెంబ్లీకి రా! పులివెందుల ప్రజలు నిన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే వారి సమస్యలను అసెంబ్లీలో ఎందుకు ప్రస్తావించడం లేదు? రెండేళ్లలో జగన్ అసెంబ్లీకి వచ్చింది ఒక్కసారి మాత్రమే. అది కూడా ప్రమాణస్వీకారానికి వచ్చి వెళ్లిపోయారు. జగన్‌లా నేను కంచుకోటలో గెలిచిన వ్యక్తిని కాదు'. '1988 తర్వాత టీడీపీ ఎప్పుడూ గెలవని మంగళగిరిలో తొలిసారి ఓడినా వెనక్కి తగ్గకుండా పోరాడి విజయం సాధించాను. కుప్పంలో పోటీ చేయమని చెప్పినా మంగళగిరిలోనే నిలబడి 91 వేల మెజార్టీతో గెలిచి ఆ విజయాన్ని చంద్రబాబుకి గిఫ్ట్‌గా ఇచ్చాను. మంగళగిరి ప్రజల రుణం తీర్చుకుంటున్నాను. నీకు కూడా చిత్తశుద్ధి ఉంటే.. పులివెందుల ప్రజల కోసమైనా అసెంబ్లీకి రా..!' అని వైఎస్ జగన్‌కు లోకేష్ సవాల్ విసిరారు.

### కూటమి ఐక్యతను కాపాడండి.. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే మన లక్ష్యం

"కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి కూటమిలో విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. జనసేన, బీజేపీ పేరుతో టీడీపీని తిడుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. కార్యకర్తలు, నాయకులు అప్రమత్తంగా ఉండాలి. వాళ్ల ప్రచారాన్ని నమ్మి ఆవేశపడకుండా కూటమి ఐక్యతను కాపాడాలి'. 'మనమంతా ఐక్యంగా ఉండి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించాలి. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఒకే ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుంది. ఈ విషయాన్ని ప్రజలకు వివరించి కూటమి బలాన్ని మరింత పెంచాలి' అని కార్యకర్తలకు లోకేష్ పిలుపునిచ్చారు.








# స్లాస్‌పై ఒకరోజు శిక్షణ తరగతులు

**చోడవరం ఆగస్టు 25 జయ జయహే**

రాష్ట్ర వ్యాప్తంగా 4,6,8 తరగతులకు స్టేట్ లెర్నింగ్ ఎచీవ్ మెంట్ సర్వే(స్లాస్) లో భాగంగా ఈనెల 28 నిర్వహించ తలపెట్టిన స్లాస్ కార్యక్రమం పై చోడవరం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మంగళవారశీ ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చోడవరం,బుచ్చయ్య పేట,రావికమతం,మాడుగుల,చీడికాడ దేవరాపల్లి మండలాల ఫీల్డ్ ఇన్విజిలేటర్ లు పాల్గొన్నారు.ఈ శిక్షణా ఆరు మండలాల నుంచి మొత్తం 97 మంది ఫీల్డ్ ఇన్విజిలేటర్ లు,ఆరు మండలాల మండల విద్యాశాఖాధికారులు హాజరయ్యారు.ఈ శిక్షణా కార్యక్రమం నకు చోడవరం మండల విద్యాశాఖాధికారులు నీలకంఠం ,సింహాచలం, బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఐ.వి.రామిరెడ్డి కోర్సు డైరెక్టర్ లుగా, పర్యవేక్షకులుగా కె.శోభారాణి,డైట్ లెక్చరర్, సి.హెచ్.యన్.దొర,టి.రాజ్ కిరణ్ లు రీసోర్స్ పర్సన్ లుగా వ్యవహరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర విద్యా పరిశోధనా శిక్షణా సంస్థ వారు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పరీక్షలను అత్యంత సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు.ఫీల్డ్ ఇన్విజిలేటర్ లుగా ఉపాధ్యాయులు,సి.ఆర్.యమ్.టిలు ,సి.ఆర్.టిలు వ్యవహరిస్తున్నారు.



# ఇద్దరు అధ్యక్షులకు అగ్నిపరీక్షేనా...?

**మొదటి పేజీ తరువాయి...**

జరిగిన భారీ సభలో ప్రకటించారు. అయితే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండటం వేరు.. ఒక నియోజకవర్గంలో ప్రత్యక్షంగా పోటీ చేసి గెలవడం వేరు అనే వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు ఆయనకు ప్రత్యక్ష ప్రజా తీర్పు పరిమితంగానే ఉండటంతో, అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగితే మాధవ్ వ్యక్తిగత ఓటు బ్యాంకు ఎంత? పార్టీ ప్రభావం ఎంత? అన్నది ఆసక్తికరంగా మారనుంది. ఉత్తర నియోజక వర్గం నుంచి గతంలో పోటీ చేసి కంగుతిన్న మాధవ్‌కు ఒకసారి ఎమ్మెల్సీగా పనిచేసిన అనుభవం ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యక్ష పోటీ మాత్రం పూర్తిగా భిన్నమైన పరీక్ష. ముఖ్యంగా విశాఖ వంటి రాజకీయంగా చురుకైన ప్రాంతంలో ప్రతి ఓటు కోసం తీవ్ర పోటీ ఉండే అవకాశం ఉంటుంది. పోటీ చేస్తే ఏ నియోజక వర్గం నుంచి బరిలోకి దిగుతారనే దానిపై కూడా ఆసక్తి రేగుతోంది.

### పల్లాకు అసలు పరీక్ష...!

మరోవైపు గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రస్తుతం టీడీపీలో కీలక స్థాయిలో ఉన్నారు. గాజువాక నియోజకవర్గ సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తూ వస్తున్నారు. అయితే వరుస రాజకీయ విజయాలతో వచ్చిన ఇమేజ్‌ను నిలబెట్టుకోవడం అంత సులభం కాదనే చర్చ కూడా ఉంది. నియోజకవర్గంలో పారిశ్రామిక సమస్యలు, ఉపాధి, రోడ్లు, తాగునీరు, కాలుష్యం, స్టీల్ ప్లాంట్ వంటి స్థానిక అంశాలపై ప్రజల అంచనాలు పెరుగుతున్నాయి.

### 'అధ్యక్షులే...కానీ ప్రజా తీర్పే ..!

ఇద్దరు నేతల విషయంలోనూ ఒక కామన్ ప్రశ్న ఎదురవుతోంది. పార్టీ అధ్యక్ష పదవులు, రాజకీయ కుటుంబ నేపథ్యం, అధిష్టానం మద్దతు ఎంత ఉన్నా.. ఎన్నికల సమయంలో ప్రజల తీర్పే అంతిమం. ప్రస్తుతం సోషల్ మీడియా, రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న ఒక వాదన ఏమిటంటే పార్టీ పదవులను వ్యక్తిగత ప్రజాదరణను సమానంగా చూడలేమన్న వాదన వినవస్తోంది. గెలుపు... ఓటమి...వాదనలకు ఇప్పటివరకు శాస్త్రీయమైన ప్రజాభిప్రాయ సర్వే ఆధారం లేకపోవడంతో వచ్చే ఎన్నికల్లో వీరిద్దరి భవితవ్యంపై ఇప్పుడే చర్చించుకోవడం కూడా తొందరపాటే అవుతుందన్న అభిప్రాయం ఉంది.

### ఇద్దరికీ అగ్నిపరీక్ష తప్పదా...?

2029 ఎన్నికలే లక్ష్యంగా పార్టీ శ్రేణులను ఇప్పటి నుంచే సిద్ధం చేయాలని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. అదే సమయంలో బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని పీవీఎన్ మాధవ్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారు.

దీంతో ఇద్దరు రాష్ట్ర అధ్యక్షులకూ వచ్చే అసెంబ్లీ ఎన్నికలు రాజకీయంగా కీలక పరీక్షగా మారే అవకాశం ఉంది. అధ్యక్ష పదవిలో ఉండి పార్టీని నడిపించడం ఒక సవాల్ అయితే.. అదే సమయంలో ప్రజల మధ్యకు వెళ్లి ప్రత్యక్ష ఎన్నికల్లో గెలవడం మరో సవాల్ కానుంది. ప్రస్తుతం 'మాధవ్ పోటీ చేస్తే గెలుస్తారా?', 'పల్లా మళ్లీ గెలుస్తారా?' అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం చెప్పే పరిస్థితి లేదు. కానీ ఒక విషయం మాత్రం స్పష్టంగా చెప్పుకోవచ్చు. రాజకీయ వారసత్వం, పార్టీ పదవి, గత విజయాలు మాత్రమే సరిపోవు. వచ్చే ఎన్నికల్లో స్థానిక సమస్యలపై పనితీరు, ప్రజలతో సంబంధం, అభ్యర్థిపై ఉన్న వ్యతిరేకత లేదా అనుకూలత, కూటమి సమీకరణాలు, ప్రత్యర్థి బలం.. వంటివన్నీ కలిసి ఫలితాన్ని నిర్ణయించనున్నాయి. అందుకే విశాఖ రాజకీయాల్లో ఇప్పుడు వినిపిస్తున్న అసలు ప్రశ్న ఒక్కటే "పార్టీ అధ్యక్షులుగా ఎదిగిన ఈ ఇద్దరు నేతలు.. ప్రజా తీర్పు అనే పరీక్షను కూడా తట్టుకుని నిలబడగలరా...?" అన్నదే విశాఖ వాసుల వాదనగా ఉంది. వారు విజేతలుగా గెలవడంతో పాటు పార్టీని ఎంత వరకు విజయ తీరాలకు చేరుస్తారన్నదే అసలు పరీక్ష కానుంది.



ప్లాస్టిక్ పాత్రలపై పడ్డ మరకలను

# సులభంగా తొలగించండి

## ఈ చిట్కాలను పాటిస్తే చాలు

ప్రస్తుతం ప్లాస్టిక్ అన్నది మన నిత్య జీవితంలో భాగం అయిపోయింది. మన ఇళ్లలో అనేక రకాల ప్లాస్టిక్ వస్తువులను మనం ఉపయోగిస్తున్నాం. అయితే కొన్ని వస్తువులను మాత్రం మనం రెగ్యులర్‌గా వాడుతూనే ఉంటాం. వాటిని కడిగి మరీ మళ్లీ మళ్లీ ఉపయోగిస్తాం. అయితే ప్లాస్టిక్ వస్తువులు లేదా పాత్రలపై కొన్ని సార్లు మరకలు పడుతుంటాయి. అలాంటప్పుడు వాటిని పోగొట్టడం చాలా కష్టంగా మారుతుంది. అయితే కింద చెప్పిన కొన్ని చిట్కాలను పాటిస్తే చాలు, దాంతో మీ ప్లాస్టిక్ పాత్రలపై ఏర్పడిన మరకలను చాలా సులభంగా తొలగించుకోవచ్చు. అందుకు ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం. మీరు మీ ఇంట్లో తరచూ వాడే హ్యాండ్ శానిటైజర్ సహాయంతో మీ ఇంట్లోని ప్లాస్టిక్ పాత్రలను శుభ్రం చేయవచ్చు. దీంతో మరకలు సులభంగా పోతాయి. అందుకు ఏం చేయాలంటే శానిటైజర్‌ను పాత్రకు రాసిన తరువాత 1 గంట సేపు ఆగాలి. అనంతరం తడి వస్త్రంతో శుభ్రంగా తుడవాలి. తరువాత గోరు వెచ్చని నీరు, సబ్బుతో శుభ్రం చేయాలి. దీంతో ప్లాస్టిక్ పాత్రలపై ఏర్పడిన మరకలు సులభంగా వదిలిపోతాయి. అయితే శానిటైజర్‌లో ఆల్కహాల్ కంటెంట్ ఎక్కువ. కనుక మీ ప్లాస్టిక్ పాత్రలు కలర్ చేంజ్ అయ్యే చాన్స్ ఉంటుంది. కాబట్టి వీలైనంత త్వరగా ఆల్కహాల్‌ను పూర్తిగా తుడిచే ప్రయత్నం చేయండి. లేదంటే అవి కలర్ మారిపోతాయి.


**ఉప్పు, నిమ్మరసం..**

ప్లాస్టిక్ పాత్రలకు అంటుకున్న మరకలను తొలగించడంలో ఉప్పు, నిమ్మరసం కూడా ఎంతగానో పనిచేస్తాయి. పాత్రలకు ఉన్న మరకలపై ముందుగా ఉప్పు రాసి స్క్రబర్ సహాయంతో బాగా రుద్దాలి. తరువాత మరకలపై నిమ్మరసం రాయాలి. 30 నిమిషాల పాటు వేచి ఉండాలి. అనంతరం కడిగేయాలి. ఇలా చేయడం వల్ల ప్లాస్టిక్ పాత్రలపై ఉండే మరకలు సులభంగా తొలగిపోతాయి. నిమ్మరసం సహజసిద్ధమైన బ్లీచ్‌లా పనిచేస్తుంది. కనుకనే మరకలను తొలగిస్తుంది. అలాగే మార్కెట్‌లో లభించే క్లోరిన్ బ్లీచ్‌ను వాడినా కూడా ప్లాస్టిక్ పాత్రలు, వస్తువులపై ఉండే మరకలు పోతాయి. అయితే బ్లీచ్ బాగా కఠినంగా ఉంటుంది కనుక దీన్ని వాడే సమయంలో చేతులకు గ్లోవ్స్ వేసుకుంటే మంచిది. ఇలా ఈ చిట్కాలను పాటించడం వల్ల మీ ప్లాస్టిక్ వస్తువులు లేదా పాత్రలపై ఏర్పడిన మరకలను సులభంగా తొలగించుకోవచ్చు. అవి మళ్లీ తళతళా మెరుస్తాయి. కాబట్టి ఈ చిట్కాలను పాటించడం మరిచిపోకండి.

### భోజనం చేసే సమయంలో

# మీకు ఇలా అవుతోందా?

## అయితే అది క్యాన్సర్ కావచ్చు.. జాగ్రత్త!



**క్యాన్సర్ రోగం అనేది చాప కింద నీరు లాంటిది. ఎప్పుడు ఎలా ఏ రూపంలో వస్తుందో ఎవరికీ తెలియదు. కొన్ని రకాల క్యాన్సర్లు అయితే సడెన్‌గా వస్తాయి.**

కానీ కొన్ని క్యాన్సర్లు వచ్చే ముందు మనకు మన శరీరం కొన్ని లక్షణాలను తెలియజేస్తుంది. వాటిని బట్టి మనం అలర్ట్ అవ్వాల్సి ఉంటుంది. దీంతో మనం త్వరగా చికిత్స తీసుకుని క్యాన్సర్‌ను తరిమేయవచ్చు. ఇక పాంక్రియాటిక్ క్యాన్సర్ కూడా అలాంటిదే అని చెప్పవచ్చు. ఈ క్యాన్సర్ కారణంగా ఏటా కొన్ని లక్షల మంది చనిపోతున్నారు.

కానీ పాంక్రియాటిక్ క్యాన్సర్ వస్తే ఆరంభంలోనే మనకు కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. అవేమిటో ఇప్పుడు తెలుసుకుందాం. మీరు భోజనం చేసే సమయంలో ఆహారాన్ని నమిలాక మింగేటప్పుడు గొంతులో బాగా నొప్పిగా ఉంటుందా. అయితే అది పాంక్రియాటిక్ క్యాన్సర్ కావచ్చని వైద్యులు చెబుతున్నారు. ఎందుకంటే క్యాన్సర్ కణాలు ఏర్పడితే ఆహార నాళం, ఆ భాగంలో ట్యూమర్లు తయారై అక్కడి భాగాలు కుచించుకుపోతాయి. దీంతో ఆహారం కిందకు వెళ్లదు. ఫలితంగా మనకు నొప్పి వస్తుంది. ఇలాంటి లక్షణం గనుక ఎవరిలో అయినా కనిపిస్తే దాన్ని క్యాన్సర్‌గా అనుమానించాలి. వెంటనే డాక్టర్‌ను కలవాలి.

**ఇవి కూడా క్యాన్సర్ లక్షణాలే..**

ఇక అజీర్తి, కడుపు ఉబ్బరం, గుండెల్లో మంట, అసిడిటీ వంటివన్నీ సాధారణ జీర్ణ సమస్యలే. తరచూ అందరికీ వస్తూనే ఉంటాయి. కానీ ఇవి వచ్చినప్పుడు మీకు గొంతులో ఆహార నాళం లేదా పొట్ట భాగంలో నొప్పిగా కనుక ఉంటే దాన్ని క్యాన్సర్‌గా అనుమానించాలి. ముఖ్యంగా మీకు నోటి నుంచి గ్యాస్ బయటకు వెళ్లేటప్పుడు నొప్పిగా ఉంటే దాన్ని క్యాన్సర్‌గా అనుమానించాల్సిందే. లేదంటే ప్రాణాల మీదకు రావచ్చు.అలాగే కొందరు కొన్ని రకాల మెడిసన్లను వాడడం వల్ల, లేదా వయస్సు మీద పడడం వల్ల కొందరికి కాస్త ఆహారం తినగానే కడుపు నిండిన భావన కలుగుతుంది. అధిక బరువు తగ్గించే మందులను లేదా ఇతర హెర్బల్ ఔషధాలను వాడినా కూడా కాస్త తినగానే కడుపు నిండినట్లు అవుతుంది. అయితే మీరు ఇలాంటివేవీ వాడకున్నా మీకు కాస్త తినగానే కడుపు నిండిపోతుందని అనిపస్తున్నా, కడుపులో నొప్పి వస్తున్నా దాన్ని క్యాన్సర్‌గా అనుమానించాల్సిందే. సాధారణంగా పాంక్రియాటిక్ లేదా అండాశయ, జీర్ణాశయ క్యాన్సర్ అయితే ఇలాంటి లక్షణం కనిపిస్తుంది. కనుక ఈ లక్షణం కనిపిస్తే వెంటనే అలర్ట్ అవ్వాలి.

**వెంటనే డాక్టర్‌ను కలవాలి..**

కొందరికి పలు రకాల కారణాల వల్ల లేదా మెడిసిన్లను తీసుకోవడం వల్ల ఎల్లప్పుడూ వికారంగా వాంతికి వచ్చినట్లు ఉంటుంది. అయితే అదే సమయంలో కడుపులో లేదా గొంతులో గనుక నొప్పిగా ఉంటే మాత్రం దాన్ని క్యాన్సర్‌గా అనుమానించాలి. కొన్ని సందర్భాల్లో బ్రెయిన్ ట్యూమర్ ఉన్నా ఇలాగే జరుగుతుంది. అలాగే జీర్ణాశయ, పాంక్రియాటిక్ క్యాన్సర్ ఉన్నవారిలోనూ ఈ లక్షణం కనిపిస్తుంది. ఇక పాంక్రియాటిక్ లేదా జీర్ణాశయ క్యాన్సర్ ఉంటే విరేచనం సాఫీగా అవదు. లేదా డయేరియా మాదిరిగా నీళ్ల విరేచనాలు అవుతాయి. ఆ సమయంలో కడుపులో నొప్పిగా కూడా ఉంటుంది. ఈ లక్షణం కనుక ఉంటే దాన్ని కూడా క్యాన్సర్‌గా అనుమానించాలి. ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను కలిసి పరీక్షలు చేయించుకోవాలి. క్యాన్సర్ ఉందని తేలితే ముందుగానే మందులను వాడవచ్చు. క్యాన్సర్‌ను తరిమేయవచ్చు. దీంతో ప్రాణాల మీదకు రాకుండా మనల్ని మనం కాపాడుకున్నవారము అవుతాము.

# రోజూ రెడ్ మీట్ తింటున్నారా?

## డయాబెటిస్ ముప్పు తప్పదంటున్న పరిశోధకులు



మన ఆహారపు అలవాట్లే, మన ఆరోగ్యాన్ని కాపాడుతాయంటున్నారు నిపుణులు. రోజూ మాంసం తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది కాదంటున్నారు. ముఖ్యంగా రెడ్ మీట్, ప్రాసెస్ చేసిన మాంసం వీలైనంత వరకు తగ్గించాలంటున్నారు. రెడ్ మీట్ అధికంగా తీసుకోవడం వల్ల టైప్ 2 డయాబెటిస్ ముప్పు పెరుగుతుందంటున్నారు. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ పరిశోధకులు నిర్వహించిన తాజా అధ్యయనంలోఈ విషయం వెల్లడైంది. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో దాదాపు 2 మిలియన్ల మందిపై జరిపిన పరిశోధనలో ఈ విషయం తేలింది.

**మాంసంతో మధుమేహం ముప్పుపై అధ్యయనం**

ది లాన్సెట్ డయాబెటిస్ అండ్ ఎండోక్రినాలజీ జర్నల్ తాజాగా ప్రచురించిన ఓ కథనం.. రెడ్ మీట్, ప్రాసెస్ చేసిన మాంసం రెగ్యులర్ గా తీసుకోవడం వల్ల టైప్ 2 మధుమేహం ముప్పు పెరుగుతున్నట్లు వెల్లడించింది. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ పరిశోధకులు ఆసియా, ఐరోపా, అమెరికా సహా పలు ప్రాంతాల్లో సుమారు 1.97 మిలియన్ల మంది అధ్యయనం నిర్వహించారు. మాంసం వినియోగం, టైప్ 2 మధుమేహం మధ్య సంబంధాన్ని కనుగొనే ప్రయత్నం చేశారు. ఈ పరిశోధన ప్రకారం ప్రతిరోజూ 50 గ్రాముల ప్రాసెస్ చేసిన మాంసాన్ని తీసుకోవడం వల్ల వచ్చే 10 సంవత్సరాలలో టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం 15 శాతం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. రోజుకు 100 గ్రాముల ప్రాసెస్ చేయని రెడ్ మీట్ తినడం వల్ల టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం 10 శాతం ఎక్కువగా ఉన్నట్లు తేలింది. ప్రతి వారం రెండు సార్లు రెడ్ మీట్ తీసుకోవడం వల్ల టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం ఉందని పరిశోధకులు కనుగొన్నారు.

**మాంసంతో టైప్ 2 డయాబెటస్ ఎందుకు వస్తుందంటే?**

టైప్ 2 డయాబెటిస్ అనేది ఇన్సులిన్ నిరోధకత, రక్తంలో అధిక చక్కెర స్థాయిలలను కలిగి ఉంటుంది. ప్రాసెస్ చేసిన మాంసం, ప్రాసెస్ చేయని రెడ్ మీట్ రెండూ టైప్ 2 డయాబెటిస్ రిస్క్‌ను పెంచుతున్నట్లు పరిశోధన వెల్లడించింది. ప్రాసెస్ చేసిన మాంసంలోని హై ప్రిజర్వేటివ్‌లు, సోడియం ఇన్సులిన్ సెన్సిటివిటీని దెబ్బతీస్తాయి పరిశోధకులు వెల్లడించారు. రెడ్ మీట్ రెగ్యులర్ గా తీసుకోవడం వల్ల గుండె జబ్బులు, క్యాన్సర్, ఊబకాయం లాంటి వ్యాధులకు కారణం అవుతుందన్నారు.

**రెడ్ మీట్‌కు బదులుగా ఏ ఫుడ్స్ తీసుకోవాలంటే?**

రెడ్ మీట్‌తో పాటు ప్రాసెస్ చేసిన మాంసంతో రకరకాల వ్యాధుల ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఫుడ్ తీసుకోవాలంటున్నారు నిపుణులు. చికెన్, ఫిష్ మాసంలో రెడ్ మీట్‌తో పోల్చితే తక్కువ సంతృప్త కొవ్వులు ఉంటాయంటున్నారు. అటు చిక్కుళ్లు, టోఫు లాంటి మొక్కల ఆధారిత ప్రొటీన్ తీసుకోవడం మంచిదంటున్నారు. క్వినోవా, బార్లీ, ఇతర తృణధాన్యాలు, గింజలు, విత్తనాలతో పాటు, ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు అవసరమైన పోషకాలను శరీరానికి అందిస్తాయంటున్నారు.

**రెడ్ మీట్ ను ఎంత తీసుకుంటే మంచిది?**

రెడ్ మీట్‌లో జింక్, ఐరన్, విటమిన్ Bను ఉంటుంది. అందుకే పూర్తిగా మానేయడం మంచిది కాదు. రోజుకు 70 వరకు తీసుకోవడం మంచిదని నేషనల్ హెల్త్ సర్వీస్ సిఫార్సు చేస్తోంది.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com